అంతర్రాష్ట్ర గజదొంగ సలీమ్ ఖురేషి అరెస్టు

- అంతర్రాష్ట్ర గజదొంగ సలీమ్ ఖురేషి అరెస్టు
- పలు రాష్ట్రాలలో 200లకు పైగా దొంగతనాలు
- చోటా రాజన్ ఇంట్లో రూ.10 కోట్లు...



- ఇటీవల విశాఖలో మూడు ఇళ్లలో చోరీ
- సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి గుర్తింపు
- మహారాష్ట్రలో అరెస్టు

... మెయిన్ 14లో

కదలం, విశాఖను వదలం

బదిలీల నేపథ్యంలో పలువురు అధికారులు, ఉద్యోగులు మంకుపట్టు

- కూటమి నేతలు, అమరావతి నుంచి ఉన్నతాధికారులతో జిల్లా అధికారులకు సిఫారసులు, ఫోన్లు
- రెవెన్యూ సహా పంచాయతీ, జల వనరులు, ఖజానా శాఖల్లో అదే తీరు
- మార్పులకు యంత్రాంగం ససేమిరా



విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ శాఖల్లో బదిలీలు సర్వసాధారణం. నిబంధనల ప్రకారం ఒకచోట ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగులు బదిలీపై వెళ్లాల్సిందే. అయితే విశాఖలో పనిచేస్తున్న పలు శాఖల ఉద్యోగులు ఇక్కడ నుంచి కదిలేందుకు ఇష్టపడం లేదు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు వెళ్లడానికి సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. ఉన్నతాధికారులపై పలు రకాలుగా ఒత్తిడి తెస్తున్నారు. అధికారులు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా నగరంలో ఉండడానికే మొగ్గుచూపుతున్నారు. ఇందుకు అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు అమరావతి స్థాయిలో ఉన్నతాధికారులతో ఫోన్లు చేయిస్తున్నారు.

బదిలీల కోసం సిఫారసు లేఖలు సమర్పించినా జిల్లా ఉన్నతాధికారులు ఐదేళ్ల సర్వీస్ నిబంధనను అనుసరించి పలువురు ఉద్యోగులను పొరుగు జిల్లాలకు పంపేశారు. ఈ విధంగా రెవెన్యూలో భారీగానే బదిలీలు అయ్యాయి.

అయితే కొందరు...తహశీల్దారు నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకూ విశాఖ నుంచి బయటకు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు ఫోన్‌లు చేయిస్తున్నారు.

నగరంలో ఒక సీనియర్ అసిస్టెంట్‌ను ఇక్కడే మరో విభాగానికి పంపారు. సదరు ... మిగతా 6వ పేజీలో

కొనసాగిన టీచర్ల బదిలీల కౌన్సెలింగ్

- నేడు 801 నుంచి 1600 వరకూ...

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కొనసాగింది. సీనియారిటీ జాబితాలో 301 నుంచి 800 నంబర్ వరకూ గల టీచర్లు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. మండలాల వారీగా ఖాళీల వివరాలను స్ర్కీన్‌పై ప్రదర్శిస్తున్నారు. సీరియల్ నంబర్ మేరకు టీచర్లను స్ర్కీన్ వద్దకు పిలిస్తే...ఖాళీలను బట్టి తమకు అనుకూలమైన పాఠశాలను ఎంపిక చేసుకుంటున్నారు. ఆప్షన్ ఇచ్చిన వెంటనే సదరు పాఠశాలకు బదిలీ చేస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల డీఈవోలు ఎస్.ప్రేమ్ కుమార్, అప్పారావునాయుడు నేతృత్వంలో పలువురు అధికారులు, డీఈవో కార్యాలయ సిబ్బంది కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. కాగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకే కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని, 801 నుంచి 1600 నంబరు వరకూ టీచర్లు హాజరుకావాలని డీఈవో తెలిపారు. ఇదిలావుండగా జీవీఎంసీ పరిధిలో టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు సుమారు 250 మంది హాజరయ్యారు.

తల్లికి వందనం

- జిల్లాలో 1,90,433 మంది విద్యార్థులు అర్హులు
- 1,30,706 మంది తల్లులకు రూ.247 కోట్లు
- సచివాలయాలకు జాబితాలు
- ఒకటి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరువాత అందజేత



విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):

ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా 'తల్లికి వందనం' పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో అర్హుల జాబితాలను అధికారులు ఇప్పటికే రూపొందించారు. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థుల జాబితాలను తయారుచేయాల్సి ఉంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో చదువుతున్న సుమారు 1,90,000 మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం వర్తించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కుటుంబంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి ఏటా ... మిగతా 6వ పేజీలో

కంపెనీలలో అసలేం జరుగుతోంది?

- తాజాగా 'సాయిశ్రేయాస్'లో ఇద్దరి మృతి
- మరొకరి పరిస్థితి విషమం

ఫార్మాలో ప్రమాదాల పరంపర

- సేఫ్టీ అధికారులే మరణిస్తే... సిబ్బంది పరిస్థితి ఏంటి?
- ఎస్‌ఓపీ పాటించేలా చూడాల్సిన బాధ్యత ఎవరిది?
- వరుస ప్రమాదాలు జరుగుతున్నా అదే నిర్లక్ష్యం



ప్రమాదం జరిగిన ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటును పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు, మరణాలకు అంతుండడం లేదు. భద్రతా ప్రమాణాలు ఎవరూ పాటించడం లేదు. అమలు చేయాల్సిన విభాగాలు చోద్యం చూస్తున్నాయి. తాజాగా సాయిశ్రేయాస్ ఫార్మా కంపెనీలో ఏకంగా మందుల తయారీ ప్రక్రియను పర్యవేక్షించే భద్రతా విభాగం అధికారులే ప్రాణాలు కోల్పోయారంటే అక్కడి పరిస్థితులు ఏమిటో ఆలోచించాల్సి ఉంది.



మృతుడు పగిరి చంద్రశేఖర్.. (ఫైల్ ఫొటో)



మృతుడు శరగడం కుమార్ (ఫైల్ ఫొటో)

పరవాడలోని విశాఖ ఫార్మా సిటీ (రాంకీ) లోని సాయిశ్రేయాస్ మందుల తయారీ కంపెనీలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత విషవాయువు పీల్చి ఇద్దరు ఉద్యోగులు మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. చనిపోయిన వారిలో పగిరి చంద్రశేఖర్ (32) సేఫ్టీ విభాగంలో అసిస్టెంట్ మేనేజర్ కాగా మరొకరు శరగడం కుమార్ (25) సేఫ్టీ షిఫ్ట్ ఆఫీసర్. అంటే ఇద్దరూ భద్రతా విభాగంలో కీలక ఉద్యోగులే. వారే మరణించారంటే...అక్కడ ఏమి జరిగినట్టు..? భద్రతా ప్రమాణాలు ఎంత వరకు పాటిస్తున్నట్టు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


ఏమి జరిగిందంటే...?

కీలకమైన వ్యాధికి సంబంధించిన ఇంటర్మీడియట్ మందు తయారుచేస్తుండగా ఆ బ్యాచ్ ఫెయిల్ అయింది. అది ప్రమాదకరమైన వ్యర్థం కావడం వల్ల ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఈటీపీ)లోకి పంపకుండా వేరే ట్యాంక్‌లోకి గానీ రియాక్టర్‌లోకి గానీ తీసి, దానిని ట్రీట్‌మెంట్ చేసి రాంకీ ఫార్మాసిటీలో వ్యర్థాల శుద్ధి కర్మాగారానికి పంపాలి. కానీ సాయి శ్రేయాస్ సిబ్బంది అలా చేయలేదు. ఆ వ్యర్థాలను నేరుగా ఈటీపీలోకి పంపించేశారు. అప్పటికే అందులో ఉన్న వ్యర్థాలతో కలిపి దానిని డైల్యూట్ చేసే ప్రక్రియ చేపట్టారు. ఆ సమయంలో ఈటీపీకి ఉన్న మ్యాన్‌హోల్స్‌ను మూసివేయాలి. కానీ తెరిచి ఉంచారు. అంటే నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఆ ప్రక్రియ జరుగుతున్నప్పుడు హెచ్2ఎస్ (హైడ్రోజన్ సల్ఫైడ్) విడుదలైంది. ఇది కుళ్లిన కోడిగుడ్డు వాసన వస్తుంది. దీనిని ఎక్కువ పీలిస్తే కోమాలోకి వెళ్లి, ప్రాణాలు కూడా పోతాయి. ఇక్కడ అదే జరిగింది. రాత్రి షిఫ్ట్‌లో ఉన్న సేఫ్టీ ఆఫీసర్లు ఇద్దరూ మరో వర్కర్ బన్సాల్‌ని తీసుకొని డైల్యూషన్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందో చూడడానికి ఈటీపీపైకి వెళ్లారు. అప్పటికే హెచ్2ఎస్ అక్కడ వ్యాపించి ఉండడంతో ఆ ఘాటైన వాయువు పీల్చి మరణించారు. వర్కర్ బన్సాల్ స్పృహ కోల్పోయాడు.

ఇవీ లోపాలు

- ఈటీపీ వద్దకు ... మిగతా 6వ పేజీలో

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన రద్దు



విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నగర పర్యటన రద్దయ్యింది. అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం నేపథ్యంలో సీఎం తన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకున్నారు. ఆయన శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో జరిగే రెన్యువబుల్ ఎనర్జీ దక్షిణ భారత సదస్సుకు హాజరు కావలసి ఉంది. అలాగే సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన 'ది డెక్' భవనాన్ని, ఆ భవనం ఐదో అంతస్థులో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించాల్సి ఉంది. ఆ తరువాత వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే సమావేశంలో పాల్గొని, పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి చర్చించాల్సి ఉంది. ఇవన్నీ రద్దయ్యాయి.

పెందుర్తిలో వ్యర్థ జలాల శుద్ధి కర్మాగారం

- రూ.452.46 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ప్రాంతంలో వ్యర్థ జలా ల శుద్ధి కర్మాగారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.452.46 కోట్లు విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ పనులు చేపడుతుంది. ఈ ప్రాజెక్టును 15 ఏళ్లు నిర్వహిస్తారు. విశాఖపట్నంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా దీనిని ఏర్పాటుచేస్తున్నట్టు పేర్కొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాల్లో 55.39% ఉత్తీర్ణత

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. మే 19 నుంచి 28వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో జిల్లా ఉత్తీర్ణత 55.39 శాతంగా నమోదైంది. బాలురు 2,100, బాలికలు 1455 మంది...మొత్తం 3,555 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలురు 1,142 మంది (54.38 శాతం), బాలికలు 827 (56.84 శాతం) వెరసి 1,969 మంది (55.39 శాతం) ఉత్తీర్ణులయ్యారు. జూన్ 13 నుంచి 19వ తేదీ వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తులు చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్

హోం మంత్రి సూచనపై సీపీ కసరత్తు

- గ్రీన్ సిగ్నల్‌తో ఒక కూడలి దాటిన వాహనం తదుపరి కూడలికి వెళ్లేసరికి గ్రీన్ ఉండేలా సమకాలీన వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు
- ట్రాఫిక్ కూడళ్ల వద్ద కష్టాలు తగ్గుముఖం పడతాయని ఆశాభావం



హనుమంతవాక వద్ద ట్రాఫిక్ (ఫైల్)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ (సమకాలీనం)పై పోలీసులు దృష్టిసారించారు. ఒక కూడలిలో గ్రీన్‌సిగ్నల్ దాటిన వాహనం తర్వాత కూడలి వద్దకు వెళ్లేసరికి గ్రీన్‌సిగ్నల్ ఉండేలా సమకాలీన సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత ఇటీవల పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైనప్పుడు ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు సిగ్నల్స్‌ను సింక్రనైజేషన్ చేయడంపై ఆలోచన చేయాలని సీపీ శంఖబ్రతబాగ్చికి సూచించారు. ఈ మేరకు సిగ్నల్స్ సింక్రనైజేషన్ సాధ్యాసాధ్యాలపై నిపుణులతో సంప్రతింపులు ప్రారంభించారు.

నగరంలో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య జటిలంగా తయారవుతోంది. వాహనాలు పెరగడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ప్రధాన మార్గాల్లో ఒకచోట సిగ్నల్ పడితే వాహనాలు కిలోమీటర్లు బారులు తీరిపోతున్నాయి. ఒక్కోసారి కూడలి దాటేందుకు రెండుసార్లు సిగ్నల్స్ పడేంత వరకూ వేచిచూడాల్సిన పరిస్థితి ఉంటోంది. అంతసేపు వేచి ఉండలేక కొందరు సిగ్నల్ జంపింగ్‌లకు పాల్పడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను సింక్రనైజేషన్ చేయాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. అధికారులు దీనిపై పలు మార్లు ప్రకటనలు చేసినప్పటికీ ఆచరణలోకి రాలేదు. ఇటీవల రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనిత నగర పోలీసులు రూపొందించిన 'అస్త్రం' యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రాఫిక్ కష్టాల నుంచి వాహన చోదకులు తప్పించుకునేందుకు ఈ 'అస్త్రం' మొబైల్ యాప్ దోహదపడుతుందని సీపీ శంఖబ్రతబాగ్చి హోంమంత్రికి వివరించారు. అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారిందన్నారు. ఒకచోట రెడ్ సిగ్నల్‌కు దొరికితే తర్వాత అన్ని కూడళ్ల వద్ద కూడా రెడ్‌సిగ్నల్ పడి ఉండడంతో ఆగాల్సిన పరిస్థితి ఉంటోందన్నారు. దీనివల్ల వాహన చోదకులు చాలా సమయం ప్రయాణం కోసమే కేటాయించాల్సిన పరిస్థితి తలెత్తుతోందన్నారు. దీనిని అధిగమించేందుకు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను సింక్రనైజ్ చేయాలని, అలా చేయడం వల్ల ఒకచోట గ్రీన్‌సిగ్నల్ పడితే తర్వాత కూడలికి ... మిగతా 6వ పేజీలో



తోటగరువులో సన్నబియ్యంతో చేసిన మధ్యాహ్న భోజనం చేస్తున్న బాలికలు

పాఠశాలలు పునఃప్రారంభం

- సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజునే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ స్కూలు కిట్లు పంపిణీ చేశారు. అలాగే ఈ ఏడాది నుంచి యూనిఫామ్ డిజైన్ మార్చారు. దీనికి అనుగుణంగా విద్యార్థులకు మూడు జతలకు అవసరమైన క్లాత్ అందజేశారు. కాగా మధ్యాహ్న భోజనానికి ... మిగతా 6వ పేజీలో

నగరంలో భారీ వర్షం

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి 6.30 గంటల వరకూ వర్షం కురిసింది. ఏకధాటిగా రెండు గంటలు పడిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జ్ఞానాపురం, చావులమదుం, ఆర్టీసీ కాంప్లెక్స్, పూర్ణామార్కెట్, ఇసుకతోట తదితర ప్రాంతాల్లో వరదనీరు గెడ్డల నుంచి పైకి వచ్చి రహదారులపై ప్రవహించింది. గాజువాకలో 42.77 మి.మీ., మహారాణిపేటలో 43 మి.మీ., సిద్ధేశ్వరంలో 50.75 మి.మీ., నాతయ్యపాలెంలో 32 మి.మీ. నమోదైంది.

కూటమి ఏడాది వేడుక




ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేకు కట్ చేస్తున్న ఎంపీ ఎం.శ్రీభరత్. చిత్రంలో ఎమ్మెల్యే వెలగపూడి, పట్టాభి, తదితరులు ఉన్నారు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం ఉదయం ఆర్కే బీచ్‌రోడ్డులో టీడీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. ఎంపీ ఎం.శ్రీభరత్, తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం అక్కడే కేకు కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చోడే పట్టాభి, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేయడం గర్వంగా ఉందన్నారు. -విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

నేటి నుంచి అబుదాబీకి విమాన సర్వీస్

- విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య కొత్త విమానం ప్రారంభం



విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం నుంచి అబుదాబీకి అంతర్జాతీయ విమాన సర్వీసు శుక్రవారం ప్రారంభం కానుందని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం తెలిపింది. అలాగే గురువారం నుంచి విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య కొత్త విమానం ప్రారంభమైందని పేర్కొంది. ఈ విమానం భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 12.35 గంటలకు బయలుదేరి 1.55 గంటలకు విశాఖపట్నం వస్తుంది. ఇక్కడి నుంచి మధ్యాహ్నం 2.25 గంటలకు బయలుదేరి 3.45 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది.

ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదనపై హర్షం

విశాఖపట్నంలో ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీన సీఎం చంద్రబాబునాయుడుకు, కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రం ఇచ్చామని, దానికి వారు స్పందించి విశాఖపట్నంలో ఆ యూనివర్సిటీకి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు బుధవారం ప్రకటించారని అపాటా ప్రతినిధులు కుమార్ రాజా, నరేశ్‌కుమార్, డీఎస్ వర్మలు హర్షం వ్యక్తంచేశారు. భోగాపురం సమీపాన ఈ యూనివర్సిటీ వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు.

నిరుపయోగంగా యంత్రాలు

- సింహగిరిపై వృథాగా పడి ఉన్న లక్షలాది రూపాయల పరికరాలు
- ఏళ్ల తరబడి ఉపయోగంలో లేని బయో డైజెస్టర్'
- మూలకు చేరిన గ్లాసులు, ప్లేట్లు శుభ్రం చేసే మెషీన్
- తుప్పు పడుతున్న పైపులు
- అధికారుల నిర్లక్ష్యమే కారణం


అలంకారప్రాయంగా ఉన్న డైజెస్టర్ మెషిన్

సింహాచలం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి, భక్తుల సేవలకు వినియోగపడాలన్న లక్ష్యంతో కొందరు దాతలు తమ శక్తి మేరకు పలు రూపాల్లో విరాళాలు అందజేస్తుంటారు. కానీ దేవస్థానం అధికారులు ఆ యంత్రాల వినియోగంలో నిర్లక్ష్య ధోరణి చూపిస్తున్నారు. ఇందుకు అన్నప్రసాద భవనానికి చేరువలో నిరుపయోగంగా పడి ఉన్న బయోడైజెస్టర్ యంత్రం ఉదాహరణగా చెప్పవచ్చు. అప్పన్నస్వామికి భక్తులు సమర్పించిన పువ్వులు, తులసీ వంటి వాటిని పూజలు తరువాత బయట వృథా చేయకుండా సద్వినియోగం చేయాలన్న లక్ష్యంతో విశాఖ ఉక్కు కర్మాగారం ఆర్థిక సహకారంతో సింహగిరిపై బయో డైజెస్టర్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ మౌలిక వసతుల కల్పన పథకం కింద సుమారు రూ.10 లక్షలు వెచ్చించగా దీనికి దేవస్థానం నిధులను కూడా మ్యాచింగ్ గ్రాంట్‌గా అప్పటి ఈఓ కోదూరి రామచంద్రమోహన్ సమకూర్చారు. ఈమేరకు 2018 ఫిబ్రవరి 13న యంత్రాన్ని ప్రారంభించారు. కొద్ది రోజులు మాత్రమే దాన్ని వినియోగించి సేంద్రియ ఎరువును తయారు చేసి సింహగిరిపై అభివృద్ధి చేసిన గ్రీనరీ, దేవస్థాన ఆధీనంలోని నృసింహ వనంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ క్షేత్రంలో కూరగాయల, పువ్వుల మొక్కలకు ఉపయోగించేవారు. తరువాత ఈఓ రామచంద్రమోహన్‌కు బదిలీ కావడంతో అనంతరం ఈఓలుగా వచ్చిన వారు ఈ యంత్రం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో యంత్రం ఇప్పటికీ నిరుపయోగంగా పడి ఉంది. అలాగే అన్నప్రసాద విభాగంలో ఎంగిలి గ్లాసులు, ప్లేట్లు శుభ్ర చేసేందుకు కొనుగోలు చేసిన ప్రత్యేక యంత్రం కూడా మూలన పడి ఉంది. అన్నప్రసాద భవనంలో అగ్ని ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన పైపులు కూడా చాలా వరకు మరమ్మతుకు గురై వృథాగా పడి ఉన్నాయి.

శిథిల భవనం తొలగింపు

ఎండాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న శిథిల తుఫాన్ రక్షిత భవనాన్ని జీవీఎంసీ సిబ్బంది గురువారం కూల్చివేశారు. స్థానిక నాయకుల వినతి మేరకు ఈ భవనాన్ని కూల్చివేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఈమేరకు అధికారులు భవనాన్ని తొలగించారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

సింహాచలం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ మేయర్ పీలా శ్రీనివాస్‌కు కార్పొరేటర్ పివి నరసింహం వినతిపత్రం అందించారు. గురువారం ఆయన మేయర్‌ను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకులవీధిలో కాలువ నిర్మించాలని, మైత్రినగర్‌లో రక్షణకు గార్డును నియమించాలన్నారు.

ప్రభుత్వ భూమిలో అకేషియా చెట్ల నరికివేత


చెట్లు నరికివేసిన ప్రాంతం

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలం రామవరం గ్రామంలో సర్వే నంబరు 73లో ఉన్న ప్రభుత్వ భూమిలో అకేషియా చెట్లను కొందరు వ్యక్తులు నరికేశారు. గెడ్డ పోరంబోకులో సుమారు పది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో చెట్లు భారీగా పెరిగాయి. ఇదే భూమికి ఆనుకుని జిరాయితీ భూమిలో అకేషియా తోట ఉంది. ఈ తోట కటింగ్‌కు రావడంతో యజమాని అమ్మకానికి పెట్టారు. చెట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు సదరు జిరాయితీలోని చెట్లు నరికారు. తరువాత తోటకు ఆనుకుని ప్రభుత్వ భూమిలో ఉన్న చెట్లపై కన్ను వేసి, వారం రోజుల నుంచి చాలా వరకు చెట్లు కొట్టేసి కలప తరలించుకుపోయారు. ఇందులో రెవెన్యూ శాఖకు చెందిన వారి ప్రమేయం ఉందన్న ప్రచారం సాగుతుంది. ఈ సంఘటనపై కొందరు గ్రామస్తులు జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. కాగా ప్రభుత్వ భూమిలో చెట్ల నరికివేతపై రామవరం గ్రామ పాలనాధికారి వద్ద ప్రస్తావించగా ప్రభుత్వ భూమిలో కొన్నిచెట్లు కొట్టేసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే చెట్లు నరికివేత నిలిపివేయాలని హెచ్చరించానని, లేకపోతే క్రిమినల్ కేసు పెడతానని స్పష్టం చేశానని చెప్పారు.

17న ముత్యాలమ్మ, భూలోకమ్మ పండగ

సాగర్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవానిపాలెం గ్రామస్తుల ఆరాధ్య దేవతలు ముత్యాలమ్మ, భూలోకమ్మ, పోలమాంబ అమ్మవార్ల పండగ ఈనెల 17న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పండగలో భాగంగా అమ్మవార్ల ఆలయాన్ని రంగులతో సుందరంగా అలంకరించడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతు దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ అప్పలనాయుడు తెలిపారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వెల్లంకి పంచాయతీలో బొడ్డపాలెం, వెల్లంకి, గారిపేట, మన్యాలపేట, అప్పన్న కాలనీ, ఈగలవానిపాలెం, పాలవలస, మెట్టమీదపాలెం, గుడిలోవ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సింహాచలంలో...

సింహాచలం : అంతర్జాతీయ యోగా దినోత్సవం, సింహగిరి ప్రదక్షిణ ఉత్సవాలను పురస్కరించుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అత్యవసర పనులు చేపట్టాల్సి ఉన్నందుకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం అయన ఒక ప్రకటన విడుదల చేశారు. వార్డులోని సింహపురికాలనీ, ధారపాలెం సింహపురి లేఅవుట్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

గ్రామాల్లో పెరుగుతున్న జ్వరాలు

పద్మనాభంరూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పలువురు మంచాన పడుతున్నారు. రేవిడి పీహెచ్‌సీలో ప్రతిరోజూ 30 మంది వరకూ జ్వరపీడితులు చికిత్స పొందుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 24 మంది ఎంపిక

తగరపువలస, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థుల్లో 24 మంది ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌కు ఎంపికయ్యారని తగరపువలస ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు జి. మోహనరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ర్యాలీ

తగరపువలస, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఆర్. అప్పలరాజు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు బడిఈడు కలిగిన పిల్లలను పనిలో పెట్టకుండా పాఠశాలలకు పంపించాలని కోరారు, కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ


చిట్టివలస ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస, చిట్టివలస పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. చిట్టివలస ఉన్నత పాఠశాలలో సహకార సొసైటీ అధ్యక్షుడు రామునాయుడు వీటిని విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం దొడ్డి ఆదినారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అలాగే బాలికల ఉన్నత పాఠశాలలోను, చిట్టివలస సంతపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కిట్లు పంపిణీ చేశారు.

భీమునిపట్నంలో...

భీమునిపట్నం : విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ తెలిపారు. బుధవారం ఆమె పీఎస్‌ఎం హైస్కూల్‌లో 9, 10 తరగతుల విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పాఠశాల హెచ్‌ఎం టి. శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ లేక అవస్థలు


బస్ షెల్టర్ తొలగించిన ప్రాంతం

సాగర్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో వినాయకుడి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను కొద్ది రోజుల క్రితం తొలగించారు. దీన్ని జీవీఎంసీ సిబ్బంది తొలగించారా? లేదా ఇనుప సామగ్రి విక్రయించేవారు చోరీ చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్షా కాలం కావడంతో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



ఆరో వార్డు పీఎంపాలెంలో కేక్ కట్ చేస్తున్న గురునాథ్, ఐదో వార్డు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మొల్లి లక్ష్మణరావు

కూటమి ఏడాది పాలన సంబరాలు

భీమునిపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని టీడీపీ నియోజకవర్గ నాయకుడు స్వామి అన్నారు. బీచ్‌రోడ్‌లోని ఎమ్మెల్యే గంటా కార్యాలయంలో ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్నికుమారిలక్ష్మి, నాయకులు గొలగాని నరేంద్రకుమార్, మారోజు సంజీవకుమార్, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, గిడుతూరి శ్రీనివాసరావు, పుక్కళ్ల లక్ష్మీకుమారి, పద్మనాభం మండల నాయకులు దామోదరరావు పాల్గొన్నారు.

ఐదు, ఆరు వార్డుల్లో...

కొమ్మాది : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఐదు, ఆరు వార్డుల్లో సంబ రాలు నిర్వహించారు. ఆరో వార్డు పరిధిలోని పీఎంపాలెం అవంతి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గేరే గురునాథ్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గొల్లంగి ఆనందబాబు, రెడ్డి సత్యనారాయణ, లొడగల జానకిరామ్, పోలిశెట్టి నాగేశ్వరరావు, పోతిన రఘు, సోడిపల్లి నారాయణరావు పాల్గొన్నారు. అలాగే ఐదో వార్డు బొట్టవానిపాలెం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, బోయి శ్రీను, నాగోతి సత్యనారాయణ, దేవర శివ, ఈగల రవి, కొండపు రాజు, ఓలేటి శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో..

ఆనందపురం : వేములవలస జంక్షన్‌లో నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు.తొలుత జంక్షన్‌లో పూల మార్కెట్ ఆవరణలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయ


వేములవలసలో ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద వేడుకలు

కులు గంట్రెడ్డి స్వామినాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, నాయకులు బీఆర్‌బీ నాయుడు, మీసాల సత్యన్నారాయణ, వానపల్లి ముత్యాలరావు, అంగటి రాము, మహంతి శివాజీ, పాండ్రంకి అప్పలరాజు, శ్రీనాథ్ నారాయణరావు, బమ్మిడి ఉమ పాల్గొన్నారు.

ఏడో వార్డులో...

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు వాంబేకాలనీ అన్న క్యాంటీన్ వద్ద కూటమి నేతలు వేడుకలు జరిపారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో నాయకులు అచ్చుతరావు. శివాజీ, సూర్యప్రకాశరావు, పిళ్లా రాము, పోతిన నాయుడు, భవానీ, కలివేల్పు సూరిబాబు, నాగోతి నరసింహనాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

ఎండాడలో...

ఎండాడ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని టీడీపీ 8వ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి అన్నారు. వార్డు పరిధిలోని ఎండాడ కూడలిలో కూటమి ఏడాది పాలనపురస్కరించుకుని ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చినగోపి, ఒమ్మి బాబూరావు, పరమేశ్వరరావు, పీఆర్‌పీ శ్రీను, బెల్లాన శ్రీను, నున్నా రామలక్ష్మీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

భైరవవాక గేటు తెరిపించాలి : బీజేపీ

సింహాచలం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అడివివరం గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్న భైరవస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన గేటు తాళం తెరవాలని బీజేపీ విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు పరశురామరాజు డిమాండ్ చేశారు. భైరవస్వామి ఆలయ ద్వారం వద్ద అటవీ శాఖాధికారులు గేటుకు తాళం వేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖాధికారులు గేటుకు తాళం వేయడం వల్ల భక్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. భక్తుల ఇబ్బందుల దృష్ట్యా తక్షణమే గేటు తాళం తెరవాలని కోరారు. అనంతరం నడక మార్గంలో కిలోమీటరు పైగా పయనించి భైరవస్వామినిదర్శించుకుని, పూజలు చేశారు.


భైరవవాక గేటు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దామూ యాదవ్, దానేశ్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాతరాజ్, 98వ వార్డు మాజీ అధ్యక్షురాలు బస్వాన అప్పలనాయుడు, వీహెచ్‌పీ నేత మీసాల రవీంద్ర, పూడిపెద్ది శర్మ , తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల నూతన కమిటీల ఎన్నిక

తగరపువలస, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస కేంద్రంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర స్థాయి కమిటీల ఎన్నికలు గురువారం నిర్వహించారు. స్థానిక కల్యాణ మండపంలో జరిగిన ఈ ఎన్నికలను సీఐటీయూ కార్యదర్శి ఆర్ఎస్.ఎన్ మూర్తి పర్యవేక్షించారు. ఎస్. అప్పలనాయుడు అధ్యక్షత వహించారు. జిల్లా ఆశవర్కర్ల సంఘం అధ్యక్షురాలు సీతా రత్నం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాళ్లవలస పీహెచ్‌సీ అధ్యక్షురాలిగా సన్యాసి పైడమ్మ, భీమిలి సీహెచ్‌సీ అధ్యక్షురాలిగా పి. సూర్యకళ, తగరపువలస యూసీహెచ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఆదిలక్ష్మి, అన్నపూర్ణ ఎన్నికయ్యారు.

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన


స్వామివారికి పూజ చేస్తున్న అర్చకుడు

సింహాచలం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు.వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడా మండప ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. పూరి-యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు (22883/22884) ఈ నెల 27 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్, సంబల్‌పూర్-నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు (20809/20810) ఆగస్టు 1 వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్, సంబల్‌పూర్-ఇరోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08311/08312) ఈ నెల 27 వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్, విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్‌కు (58506/58505) ఈ నెల 30 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్, విశాఖ-బెంగళూరు-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08581/08582) ఈ నెల 30 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్, విశాఖ-తిరుపతి-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08547/08548) ఈ నెల 26 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్, విశాఖ-చర్లపల్లి-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08579/08580) ఈ నెల 28 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేయనున్నట్లు తెలిపారు.

పాఠశాలలు పునఃప్రారంభం

... 5వ పేజీ తరువాయి

నాణ్యమైన బియ్యం సరఫరా చేయడంతో టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. గురువారం సన్న బియ్యంతో తయారుచేసిన ఆహారాన్ని పిల్లలకు వడ్డించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి, అడవివరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు అన్నారు.

కదలం, విశాఖను వదలం

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగి పౌరసరఫరాల శాఖలో సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ కావాలని రాష్ట్రంలో అత్యంత కీలకమైన వ్యక్తి ద్వారా ఒత్తిడి తీసుకురాగా యంత్రాంగం సున్నితంగా తిరస్కరించింది. సివిల్ సరఫరాలో పనిచేస్తున్న ఉద్యోగికి రెవెన్యూలో కీలక మండలాంలో పోస్టింగ్ ఇస్తే అక్కడకు వెళ్లేదిలేదంటూ చెప్పడం రెవెన్యూ ఉద్యోగులు ఆక్షేపిస్తున్నారు.కలెక్టర్ ఆదేశాల మేరకు పనిచేయాలే తప్ప... ఇలా ఒత్తిడి తీసుకురావడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. బదిలీలకు సంబంధించి వస్తున్న ఒత్తిళ్లపై జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలు చేపట్టామని, దీనికి సంబంధించి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయా చోట్ల విధుల్లో చేరాలే తప్ప మార్పులు చేర్పులకు తావులేదని స్పష్టంచేస్తోంది. భూపరిపాలనా ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన గాజువాక తహశీల్దారు తోట శ్రీవల్లిని వీఎంఆర్‌డీఏకు, సీతమ్మధార తహశీల్దారు రమేష్‌ను ములగాడ తహశీల్దారుగా బదిలీ చేశారు. అయితే ఇరువురు ఆయా చోట్ల పనిచేయడానికి ఇష్టపడడం లేదని తెలి సింది. తిరిగి సీసీఎల్ఏకు వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారని అంటున్నారు. కాగా బదిలీ అయిన తహశీల్దార్లు, ఉద్యోగులు వెంటనే రిలీవ్ కావాలని జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు పెందుర్తి, ములగాడ తహశీల్దార్లు అక్కడ డీటీలకు బాధ్యతలు అప్పగించారు. మరో 30 మంది ఉద్యోగులు రిలీవ్ కాగా మిగిలినవారు కూడా ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు అప్పగించాలని యంత్రాంగం ఆదేశించింది. జిల్లా పంచాయతీ శాఖకు సంబంధించి ఉమ్మడి జిల్లా పరిధిలో మండల విస్తరణాధికారి నుంచి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి వరకూ 230 మందిని బదిలీ చేశారు. అయితే వీరిలో చాలామంది విశాఖ జిల్లాలోనే పనిచేస్తామని సిఫారసు లేఖలు తెచ్చుకున్నారు. కొందరైతే ఆనందపురం, పెందుర్తి మండలాల్లో పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని ఒత్తిడి తెచ్చారు. జల వనరుల శాఖలో ఇదే పరిస్థితి కొనసాగింది. ఒక సీనియర్ అసిస్టెంట్‌ను నగరం నుంచి విజయనగరానికి బదిలీ చేస్తే ఇక్కడ కొనసాగించాలని ఒత్తిడి తెచ్చారు. చోడవరం ప్రాంతం నుంచి ఎలమంచిలికి బదిలీ అయిన ఉద్యోగి కూడా విశాఖ కోసం పట్టుబట్టారు. ఇదిలావుండగా జిల్లా ఖజానా కార్యాలయంలో పలువురు ఉద్యోగులు పలు కారణాలతో విశాఖలోనే ఉండిపోయారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు వెళ్లకుండా ఉన్నత స్థాయిలో పైరవీ చేసుకున్నారనే ఆరోపణలు న్నాయి. నగరంలో కీలక పోస్టుల్లో పనిచేసి రెండేళ్ల క్రితం అనకాపల్లి జిల్లాకు వెళ్లి భారీగా అక్రమాలకు పాల్పడిన సీఐను ఇటీవల రేంజ్‌కు సరండర్ చేశారు. ప్రస్తుతం ఆయన సిటీలో పోస్టింగ్ కావాలంటూ అధికార పార్టీ కీలక నేత ద్వారా ఒత్తిడి తీసుకువస్తున్నారు.

ఫార్మాలో ప్రమాదాల పరంపర

... 5వ పేజీ తరువాయి

వెళుతున్నప్పుడు అక్కడ ఏ ప్రక్రియ జరుగుతున్నదో తెలుసు కాబట్టి దానికి తగిన రక్షణ పరికరాలు ధరించి వెళ్లాలి. అంటే మంచి మాస్క్ కచ్చితంగా ధరించాలి.అది విష వాయువుల నుంచి రక్షణ కల్పించేదై ఉండాలి.

- హెచ్2ఎస్‌ను వాసనను బట్టి గుర్తుపట్టవచ్చు. మ్యాన్‌హోల్ తెరిచి ఉంది కాబట్టి ఈటీపీ పైకి వెళుతున్నప్పుడే ఆ వాసన వస్తుంది. అంటే దానిని గుర్తు పట్టే స్థితితో సేఫ్టీ అధికారులు ఉండాలి. వారు ఆ వాసన గుర్తు పట్టి కిందికి దిగిపోవాలి. కానీ అలా చేసినట్టు లేదు.
- ప్రతి సంస్థ తయారుచేసే మందులను బట్టి 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)' పాటించాలి. మందుల తయారీ ప్రాంతంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సిబ్బందికి అవగాహన కల్పించి, తగిన భద్రతా పరికరాలు అందించాలి. అంటే మాస్క్‌లు, గ్లౌజులు, బూట్లు వంటివి అందులో భాగంగా ఉంటాయి.

ఏదో జరిగింది చెప్పడం లేదు

కంపెనీ యాజమాన్యం, పోలీసులు విషవాయువు లీకై దానిని పీల్చి చనిపోయారని చెబుతున్నారు.ఇంకే విషయాలు వెల్లడించడం లేదు.

నిర్లక్ష్యం ఉందని అర్థమవుతోంది

ముకుందరావు, ఈఈ
కాలుష్య నియంత్రణ మండలి

ఈటీపీలోనే వ్యర్థాలను శుద్ధి చేయకూడదు. వేరే ట్యాంకులోకి తీసుకొని చేయాలి. కానీ వారు అలా చేయలేదు. పైగా మ్యాన్‌హోల్ తెరిచి ఉంచారు. అది మూసి ఉంటేనే ప్రక్రియ సజావుగా జరుగుతుంది. అక్కడ నిబంధనల ప్రకారం వ్యవహరించలేదు. నిర్లక్ష్యం ఉందని అర్థమవుతోంది. పైగా చనిపోయిన వారిలో ఒకరికి సేఫ్టీ విభాగంలో పదేళ్ల అనుభవం ఉంది.

స్పందించని ఫ్యాక్టరీస్ విభాగం

ప్రమాదంపై వివరాలు తెలుసుకోవడానికి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి పరమేశ్వరరావుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత వారిదే. ఈ విభాగం పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో భద్రతా విభాగంలో పనిచేసే వారికి మళ్లీ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్

... 5వ పేజీ తరువాయి

వెళ్లేసరికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఉంటుంది కాబట్టి, వాహన చోదకులకు సమయం ఆదా కావడంతో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీపీకి సూచించారు. రాష్ట్ర హోం మంత్రి స్వయంగా ఆదేశించడంతో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్‌పై సీపీ దృష్టిసారించారు. నగరంలో అన్ని కూడళ్ల వద్ద వాహనాల రద్దీని అధ్యయనం చేసి, ట్రాఫిక్ సింక్రనైజేషన్ సిస్టమ్ అమలు సాధ్యాసాధ్యాలపై ఒక ప్రైవేటు సంస్థకు చెందిన నిపుణులతో సీపీ చర్చించినట్టు తెలిసిందే. వారు ఇచ్చే నివేదిక ఆధారంగా ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ చేయడానికి అవకాశం ఉన్నట్టయితే సీఎస్ఆర్ నిధులతో ప్రాజెక్టును పూర్తిచేసే అవకాశం ఉందని పోలీస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

తల్లికి వందనం

... 5వ పేజీ తరువాయి

రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' పథకం కింద అందజేస్తామని కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈమేరకు గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. విశాఖ జిల్లాలో 1,90,433 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులుగా అధికారులు గుర్తించారు. వీరికి సంబంధించి 1,30,706 మంది తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు వంతున రూ. 247.62 కోట్లు జమ చేస్తారు. ఇవి శుక్రవారం సాయంత్రంలోగా జమ అవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. కాగా గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభించారు. అంటే ఒకటో తరగతిలో విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. ఇంకా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఒకటో తరగతి, ఇంటర్ ప్రథమ ఏడాదిలో ప్రవేశాల ప్రక్రియ పూర్తయిన తరువాత ఆయా విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద రూ.13 వేలు వంతున జమచేయనున్నారు. ఇదిలావుండగా తల్లికి వందనం పథకం అర్హులు, అనర్హుల జాబితాలు గ్రామ/వార్డు సచివాలయాలకు చేరాయి. అనర్హుల జాబితాలో పొరపాటున అర్హులు ఉంటే తమ అర్హతకు సంబంధించిన వివరాలు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే దరఖాస్తుదారు కుటుంబ ఆదాయం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పరిమితికి లోబడి ఉండాలి. ఇతర వివరాలకు సచివాలయాల్లో సంప్రతించాలని అధికారులు కోరుతున్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఐటీ శాఖ చీఫ్ కమిషనర్

సింహాచలం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదాయ పన్ను శాఖ చీఫ్ కమిషనర్ శ్రీనివాస్ దండా సతీసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మ వారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి, శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.


స్తంభం వద్ద ఐటీ కమిషనర్ దంపతులు

ప్రగతిపథం వైపు ఏడాది పాలన

» సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం అంటూ కొనియాడిన నేతలు » కూటమి పాలన సంవత్సరం పూర్తవడంతో పలు ప్రాంతాల్లో సంబరాలు



మద్దిలపాలెం : 22వ వార్డులో నిర్వహించిన వేడుకల్లో కేకు కట్ చేస్తున్న టీడీపీ నేతలు



ఆరిలోవ : 12వ వార్డులో జరిగిన వేడుకల్లో కేకు కట్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, పాల్గొన్న నేతలు



ఎంవీపీ కాలనీ : హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలలో వికలాంగులకు అన్నదానం నిర్వహిస్తున్న తెలుగుదేశం నాయకులు

మద్దిలపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తి అయిన సందర్భంగా జీవీఎంసీ 22వ వార్డులో గురువారం టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ఏడాది పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టి సందడి చేశారు. అనంతరం బొట్టా వెంకటరమణ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచి అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. అన్న క్యాంటీన్లు ప్రారంభించి పేదలకు భోజనం అందించారన్నారు. పింఛన్లు పెంచి ఎంతోమంది లబ్దిదారులకు ఆదుకున్నారన్నారు. కంపెనీలు తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పించారన్నారు. తల్లికి వందనం అమలు చేసి పేద విద్యార్థులకు బాసటగా నిలిచారన్నారు. ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు దువ్వి వెంకటస్వామి, ఒమ్మి అప్పారావు, దువ్వి రాజ్‌కుమార్, డొక్కరి శ్రీనివాసరావు, కోడిబోయిన ఆనంద్, వెంకటప్రసాద్, దేవర రఘు, గణేష్, తాతారావు, అప్పారావు, దువ్వి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా పేదలకు మేలు చేయడం జరిగిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు అన్నారు. గురువారం తోటగరువులో గల టీడీపీ 12వ వార్డు కార్యాలయంలో కూటమి పాలన ఏడాది పండుగను నిర్వహించారు. భారీ కేకును కట్ చేశారు. అనంతరం సన్యాసిరావు మాట్లాడుతూ.. అధికారం వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని రూ.3 వే నుంచి రూ.4 వేల చేయడం ద్వారా ఎంతో మేలు జరిగిందన్నారు. అలాగే డీఎస్సీ నిర్వహణ, నిరుద్యోగులకు ఉపాధి లభించేలా రాష్ట్రంలో పలు ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రయత్నాలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం వంటివి రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. సంక్షే మం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

ఈ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షుడు గాడి సత్యం, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, నాయకులు గోపి, బసవ దేవుళ్ల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అలాగే టీడీపీ 10వ వార్డు ఇన్‌చార్జి మద్దిల రాజశేఖర్ ఆద్వర్యంలో కేకును కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, మద్దిల శేఖర్, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :కూటమి ప్రభుత్వం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఉషోదయ కూడలిలోని హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలలో తెలుగుదేశం నాయకులు సంబరాలు నిర్వహించారు. దివ్యాంగులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం కేకు కట్ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి, నాయకులు సత్తిబాబు, శివరెడ్డి, సీతన్నరెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలనీ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

పారిశుధ్య సిబ్బంది స్పందించి తక్షణమే తొలగింపునకు చర్యలు తీసుకోవడంతో వాహనదారుల ఊరట



రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు



నీటి తొలగింపునకు చర్యలు తీసుకొంటున్న పారిశుధ్య సిబ్బంది

వెంకోజీపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గురువారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు 15వ వార్డు హెచ్‌బీ కాలనీ స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను గుయ్యారు. ఈ నేపథ్యంలో 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్, శుభ్రం మేస్త్రి రమణ సిబ్బందితో వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే ఫుట్‌పాత్ కింద ఉన్న కాలువలోకి నీరు వెళ్లేలా ఏర్పాటు చేసిన రంధ్రానికి అడ్డంగా ఉన్న చెత్తను తొలగించి, సత్వరమే నిలిచిపోయిన నీటిని తొలగింపజేశారు. దీంతో రోడ్డుపై నిలిచిపోయిన వాహనచోదకులు, పాదచారులు ఉపశమనం పొందారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

గత ప్రభుత్వ హయాంలో చేసిన అనాలోచిత, హడావుడి నిర్మాణం కారణంగా చిన్న వర్షం వచ్చినా ఈ ప్రాంతంలో నీరు నిలిచిపోవడం, పారిశుధ్య సిబ్బంది వచ్చి తాత్కాలికంగా తొలగిస్తున్నారు తప్ప అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని హెచ్‌బీ కాలనీ శాఖ సీపీఐ కార్యదర్శి పడాల గోవింద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మోడ్రన్ ఫుట్‌పాత్‌లను నిర్మించడం వలన మార్గానికి అందం అయితే వచ్చింది గానీ నిర్మాణం చేపట్టేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో సమస్య ఉత్పన్నమైందని మండిపడ్డారు. అర కిలోమీటరు మేర ఫుట్‌పాత్ కింద కాలువకు నీరు వెళ్లేందుకు ఒకే ఒక రంధ్రం ఏర్పాటు చేస్తే సమస్యకు ఎలా శాశ్వత పరిష్కారం లభిస్తుందని గోవింద్ ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం వారు మరిన్ని ఫుట్‌పాత్‌లకు రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోకుండా కాలువలోకి సులభంగా వెళ్లేందుకు మరిన్ని రంధ్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను కూడా తొలగించే చర్యలు కూడా అవసరమని సూచించారు.

రెండు పిల్లలను ఈనిన మౌస్ డియర్

ఆరిలోవ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో మౌస్ డియర్ (మూసిక జింక) రెండు పిల్లలకు, రెడ్ నెక్డ్ వాలబీ ఒక పిల్లకు జన్మ ఇచ్చినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఈ రెండు జంతువులకు ఇదే తొలి సంతానం అని చెప్పారు. పిల్లల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసు కొంటున్నట్టు జ్యూ రేటర్ తెలిపారు.



పిల్లలతో మౌస్ డియర్

ఏయూ బ్రాండింగ్ అండ్ మీడియా అసోసియేట్

డీన్‌గా సాల్మన్ బెన్నీ

వెంకోజీపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :ఏయూ ఔట్రీచ్ బ్రాండింగ్ అండ్ మీడియా అసోసియేట్ డీన్‌గా నియమితులైన ఆంగ్ల విభాగం ఆచార్యులు డాక్టర్ ఎస్.సాల్మన్ బెన్నీ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్ అండ్ మీడియా రిలేషన్స్ డైరెక్టర్, జర్నలిజం ఆచార్యులు చల్లా రామకృష్ణ ఆచార్య బెన్నీకి బాధ్యతలు అప్పజెప్పారు.



సాల్మన్ బెన్నీని సత్కరిస్తున్న ఆచార్య చల్లా రామకృష్ణ

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

ఎంవీపీ కాలనీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం ద్వారా మరింత ప్రచారం చేసి, తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేలా ప్రోత్సహించాలని 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలతో పాటు మంచి విద్య అందుబాటులో ఉందన్నారు. ఫిషర్‌మెన్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం నిర్వహించి, పిల్లలకు పలకలు, మిఠాయిలు పంచిపెట్టారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఎంవీపీ కాలనీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : 11కేవీ సెక్టర్ 6, సెక్టర్ 1 ఫీడర్‌పై నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-1 ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మెడికవర్ వెనుక గేటు ప్రాంతం, అంజయ్యనగర్, ఎంవీపీ 1, 2, 6 సెక్టర్లు, సాయిబాబా ఆలయం రోడ్డు, శ్యామలా డ్రైఫ్రూట్స్ ఎదురు వీధి తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమన్వయంతో పార్టీ పటిష్టానికి కృషిచేయండి : మాజీ మంత్రి అమర్‌నాథ్

మద్దిలపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ పటిష్టతకు పని చేయాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. మద్దిలపాలెం పార్టీ వైసీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన తూర్పు నియోజకవర్గం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు సమన్వయకర్తగా నియమించిన మొల్లి అప్పారావు సారథ్యంలో కూటమి ప్రభుత్వం పాల్పడుతున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. భేదాభిప్రాయాలు లేకుండా సమన్వయకర్తతో కలిసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయమే ధ్యేయంగా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం బెదిరింపులకు లొంగకుండా ప్రజల పక్షాన నిలబడాలన్నారు. అనంతరం గుడివాడ అమర్‌నాథ్‌ను మొల్లి అప్పారావు సన్మానించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పూర్తి న్యాయం చేస్తానన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు రవిరెడ్డి, పల్లా దుర్గారావు, పీతల గోవింద్, బోని శివరామకృష్ణ, సురేష్, విజయచందర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సన్మానిస్తున్న మొల్లి అప్పారావు, పాల్గొన్న వైసీపీ నేతలు, కార్యకర్తలు

సినిమా గైడ్

- హౌస్‌ఫుల్-3 : రమాదేవి
- గేంబ్లర్స్ : శారద
- గది : రమాదేవి
- థగ్ లైఫ్ : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) ఆరుణ (పెదగంట్యాడ)
- భైరవం: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- సింగిల్ : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- శుభం: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 26, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 16, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 16, క్యారెట్ 44 దొండకాయలు 20, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)52, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 70,బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 95, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 30, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

యోగాంధ్రలో అందరూ భాగస్వామ్యం కావాలి : ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తూర్పు నియోజకవర్గం శాశనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు. ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టరు వీఎమ్మార్డీఏ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన ఆయన.. అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడమే కాకుండా, ప్రజలందరినీ ఇందులో భాగస్వాములుగా చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఒమ్మి సన్యాసిరావు, చోడె పట్టాభిరాం, కార్పొరేటర్లు అప్పారి శ్రీవిద్య, మూర్తి యాదవ్, లావణ్య, సునీత, మంగవేణి, కాళ్ల శంకర్, పోతనరెడ్డి, రాజశేఖర్, ధనరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పాల్గొన్న నేతలు

సమస్యల పరిష్కారం కోరుతూ విమ్స్ వైద్యుల నిరసన



ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

ఆరిలోవ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిపై సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సర్వీసు రెన్యువల్ చేసి వేతనాలు పెంచాలని కోరుతూ పలువురు వైద్యులు గురువారం ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కాంట్రాక్టు పద్ధతిలో వైద్యులను ఇక్కడ నియమించారని, ఆ తర్వాత తమ గురించి పట్టించుకోవడమే మానేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్ల కార్డులు పట్టుకొని తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఇక్కడ సేవలు అందిస్తున్న వారంతా స్పెషలైజేషన్ చేసిన వారేనని, అయితే ఎంబీబీఎస్ వైద్యుల వేతనాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విమ్స్‌లో 42 మంది వైద్యులు ఈ విధానంగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. తాము సంపూర్ణ సేవలు అందిస్తున్నా, గుర్తింపు లేకపోవడం అన్యాయమన్నారు. 2022, జనవరి 4 నుచి కాంట్రాక్టు పద్ధతిపై నెలకు రూ. 92 వేలకే పని చేస్తున్నామని చెప్పారు . గత ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రికి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించామని, కానీ ఎలాంటి స్పందన లేకుండా పోయిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనైనా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

తొలి రోజు విద్యార్థుల హాజరు అంతంతే..

» వేసవి సెలవుల అనంతరం తెరచుకున్న పాఠశాలలు



స్కూలుకు పరిమితంగా హాజరైన విద్యార్థులు

ఆరిలోవ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు గురవారం పునః ప్రారంభమయ్యాయి. అయితే తొలి రోజు విద్యార్థులు అతి తక్కువగా హాజరయ్యారు. తమ స్కూలుకు సుమారు 20 శాతం మంది మాత్రం హాజరైనట్టు తోటగరువు జిల్లా పరిషత్తు ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవానీ తెలిపారు. 1100 మంది విద్యార్థులకు సుమారు 200 మంది మాత్రం హాజరయ్యారని తెలిపారు. వీరిలో మధ్యాహ్న భోజనానికి సుమారు 150 మంది హాజరయ్యారు. అందరికీ సన్నబియ్యం భోజనం పెట్టినట్టు హెచ్‌ఎం చెప్పారు. గుడ్లు ఇంకా సరఫరా కాకపోవడంతో కూరగాయలతో భోజనం పెట్టారు. విద్యార్థులకు అందజేయాల్సిన కిట్స్ శుక్రవారం అందించినట్టు ఆమె వెల్లడించారు. అలాగే శ్రీ కృష్ణాపురం అంబేడ్కర్ గురుకులానికి సుమారు 450 మంది విద్యార్థులకు 49 మంది విద్యారులు హాజరయ్యారైనట్టు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు.

వేతనాలు పెంచరూ..

» మేయర్‌కు జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ డ్రైవర్ల వినతి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు

వెంకోజీపాలెం/ సిరిపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు పెంచాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మేయర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. జీవీఎంసీలో ఎన్నో ఏళ్లగా ఇంజనీరింగ్ విభాగం, ఇతర ఉన్నతాధికారుల వద్ద ఉదయం నుంచి రాత్రి వరకూ విధులు సక్రమంగా నిర్వహిస్తూ, ఏ అధికారికీ ఎలాంటి ఆటంకం కలగకుండా పని చేస్తున్న తమకు ఎటువంటి గుర్తింపు లేదని, జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగం డ్రైవర్లు, వర్కర్లకు వేతనాలు పెరిగాయని, వారి వేతనాలతో పాటు ఇంజనీరింగు విభాగం అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకూ సమాన వేతనం రూ.24,500 పెంచేలా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగం డ్రైవర్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవుట్‌సోర్సింగ్‌లోని ఇంజనీరింగ్ విభాగం డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న జీతభత్యాలను పరిశీలించి తగిన న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్‌ను అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

విజ్ఞానదాయకంగా రోబోకాన్-2025 సదస్సు



సదస్సులో పాల్గొన్న ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు

రామ్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో ఉత్తరాంధ్ర ఆర్థోపెడిక్ అసోషియేషన్ రోబోకాన్-2025 పేరుతో వైద్య విద్యా సదస్సును నిర్వహించారు, రోబోట్ ఆధారిత మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సపై అవగాహన కల్పిస్తూ గురువారం రామ్‌నగర్‌లో ఒక హోటల్‌లో ఈ సదస్సును నిర్వహించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ సౌరబ్ ఎస్ కులకర్ణి, డాక్టర్ కేజే రెడ్డి, డాక్టర్ ఎంవీ సుధాకర్ చర్చా కార్యక్రమంలో రోబోటిక్ టోటల్ నీ జాయింట్ రీప్లేస్‌మెంట్, సాంకేతిక విధానాలపై అవగాహన కలిగించారు. ఆర్థో ప్లాస్టీ వంటి క్లినికల్ అంశాలపై శాస్త్రీయ, విలువైన అంశాలను వివరించారు. సదస్సులో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ గంగావరపు శ్రీదర్ డాక్టర్. అరుణకుమార్ తదితరులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 కి పైగా ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

వాణి జాతీయ సదస్సుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎంపిక

కంచరపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో ఈ ఏడాది డిసెంబరు 16, 17 తేదీల్లో చేపట్టనున్న ప్రతిష్టాత్మక జాతీయ సదస్సు వాణి-2025 నిర్వహణకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో ఆవిష్కరణలు, సాంకేతికత, సుస్థిరాభివృద్ధి తదితర అంశాల్లో వస్తున్న డిజిటల్ మార్పులు, అభివృద్ధిపై ఈ సదస్సులో చర్చిస్తారు. సదస్సు సమన్వయకర్తగా ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు, సహ సమన్వయకర్తగా సీనియర్ లెక్చరర్ డా.రాజు వ్యవహరిస్తారు. జాతీయ స్థాయి సదస్సు నిర్వహణకు విశాఖపట్టణం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎంపిక కావడంపై అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కంచరపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ రెండోజోన్ కంచరపాలెం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ లోకోషెడ్ ఫీడర్ పరిధిలో చాకలి గెడ్డ, ఆశవానిపాలెం, మేఘాద్రిపేట, పోర్టు ఏరియా తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేశామని సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. పూరి - యశ్వంత్‌పూర్ -పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు (22883/22884) ఈనెల 27 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్, సంబల్‌పూర్-నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు (20809/20810) ఆగస్టు 1 వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్, సంబల్‌పూర్-ఇరోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08311/08312) ఈనెల 27 వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్, విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్‌కు (58506/ 58505) ఈనెల 30 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్, విశాఖ-బెంగళూరు-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08581/08582) ఈనెల 30 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్, విశాఖ-తిరుపతి-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08547/08548) ఈనెల 26 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్, విశాఖ-చర్లపల్లి-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08579/08580) ఈనెల 28 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా కూటమి పాలన ఏడాది సంబరాలు



అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో కేకు కట్ చేస్తున్న ఎంపీ శ్రీభరత్



జనసేన కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

సీతంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. కార్యాలయంలో కేకు కోసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఉషాకిరణ్, బోలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకొని వెళుతోందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా

సీతంపేట: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి పనులు జరుగుతాయని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుందని, ఆరిలోవలో రైల్వే జోన్ భవన నిర్మాణాలు ఇందుకు నిదర్శనమన్నారు. నాలుగు వందే భారత్ రైళ్లు ఇప్పుడు ఉత్తరాంధ్రలో పరుగు పెడుతున్నాయన్నారు. విశాఖలో డబల్ డెక్కర్ మెట్రో డీపీఆర్ సిద్ధం చేశారన్నారు. అనకాపల్లి దాహార్తి తీర్చే పుష్కర ప్రాజెక్ట్‌కు కూటమి పాలన చేపట్టిన నెలలోనే శ్రీకారం చుట్టారని, సుమారు రూ.85 కోట్లతో పనులు చేపట్టి ప్రజలకు తాగునీరు అందించారన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో అనేక నూతన కంపెనీలు విశాఖ వైపు వస్తున్నాయన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని వెనక్కినెట్టి అభివృద్ధి చిరునామాగా ప్రభుత్వం మారుస్తోందన్నారు.



మూర్తి యాదవ్

దొండపర్తి: గ్రేటర్ 42వ వార్డులో విజయోత్సవాలు ఘనంగా జరిగాయి. రైల్వేన్యూకాలనీలోని వార్డు పార్టీ కార్యాలయంలో నాయకులు కేకు కోసి నాయకులకు తినిపించారు. ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్, వార్డు అధ్యక్షుడు కన్నం వెంకట రమణారావు, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు ముప్పాళ్ళ శ్రీకృష్ణ, దువ్వి కాశీప్రసాద్, ఎంఎల్ఎన్ రావు, పిలక శ్రీదేవి, కుప్పిలి కుంతీదేవి, గట్టు సీతాదేవి పాల్గొన్నారు.



రైల్వే న్యూకాలనీలోని టీడీపీ కార్యాలయంలో వేడుక

రైల్వే ఆసుపత్రిలో ఆధునిక వైద్య వసతులు



ఆసుపత్రిలో యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని వాల్తేరు డివిజన్ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టెరిలైజేషన్, ఫిజియోథెరపీ లేజర్ యూనిట్లను డీఆర్ఎం లలిత్ బొహ్రా, వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా గురువారం ప్రారంభించారు. రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉన్నత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. క్రిమి రహితం చేయడానికి, కండరాలు, కణజాల నొప్పులతో బాధపడుతున్నవారు వేగంగా కోలుకోవడానికి ఆధునిక యంత్రపరికరాలు ఉపయోగపడతాయని డీఆర్ఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఈ.శాంతారామ్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్‌బాబు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి ఇద్దరు విద్యార్థినుల ఎంపిక



ఎ.అఖిల



పి.సంజన

సీతంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మధురానగర్‌లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినులు ఎ.అఖిల, పి.సంజన జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. వీరికి 9, 10, ఇంటర్మీడియట్ రెండేళ్లు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చెల్లిస్తుందని ప్రధానోపాధ్యాయిని లక్ష్మీనరస తెలిపారు. ఉపాధ్యాయులు, హెచ్ఎం విద్యార్థినులను అభినందించారు.

జీవీఎంసీ పాఠశాలలు కళ కళ



ప్రధానోపాధ్యాయిని లక్ష్మీనరసను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో జీవీఎంసీ పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. సీతంపేట మధురానగర్‌లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రవేశాలకు విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. తొలి రోజునే 73 మంది విద్యార్థులు కొత్తగా చేరినట్లు హెచ్ఎం లక్ష్మీనరస తెలిపారు. గతంలో 19 మంది ఉపాధ్యాయులు ఉండగా ముగ్గురు తప్ప అందరూ కొత్త టీచర్లు వచ్చారని ఆమె తెలిపారు. వీరికి అదనంగా ఒక పీఈటీ, తెలుగు టీచర్ పోస్టు మంజూరయ్యాయన్నారు. వారిద్దరూ చేరవలసి ఉందన్నారు. మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో 26 మంది విద్యార్థులు కొత్తగా చేరినట్లు హెచ్ఎం దేముడు బాబు తెలిపారు. కొత్తగా చేరిన ఉపాధ్యాయులతో హెచ్ఎంలు సమావేశాన్ని నిర్వహించి విద్యార్థులకు మంచి బోధన అందించాలని, పాఠశాల, తరగతుల నిర్వహణ చక్కగా నిర్వర్తించాలని సూచించారు. ఉపాధ్యాయులంతా ప్రధానోపాధ్యాయులకు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తామన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు 50 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి నూతన ఉపాధ్యాయులు పాఠాలు చెప్పారు. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధా కుమారికి బదిలీపై వచ్చిన నూతన ఉపాధ్యాయులు శాలువా కప్పి సత్కరించారు. వీరందరికీ ఇన్‌చార్జ్ హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారి ఎంఎన్‌వీ విశ్వనాథం, పీడీ ఎ.సునంద్, సీఆర్పీ భాగ్యలక్ష్మి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు స్వాగతం పలికారు.

పాఠశాలలు పునఃప్రారంభం

(5వ పేజీ తరువాయి)

నాణ్యమైన బియ్యం సరఫరా చేయడంతో టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. గురువారం సన్న బియ్యంతో తయారుచేసిన ఆహారాన్ని పిల్లలకు వడ్డించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి, అడవివరం ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇమంది పైడిరాజు అన్నారు.

తల్లికి వందనం

(5వ పేజీ తరువాయి)

రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' పథకం కింద అందజేస్తామని కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు గురువారం మార్గదర్శకాలు జారీచేసింది. విశాఖ జిల్లాలో 1,90,433 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులుగా అధికారులు గుర్తించారు. వీరికి సంబంధించి 1,30,706 మంది తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు వంతున రూ.247.62 కోట్లు జమ చేస్తారు. ఇవి శుక్రవారం సాయంత్రంలోగా జమ అవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. కాగా గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభించారు. అంటే ఒకటో తరగతిలో విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. ఇంకా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఒకటో తరగతి, ఇంటర్ ప్రథమ ఏడాదిలో ప్రవేశాల ప్రక్రియ పూర్తయిన తరువాత ఆయా విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద రూ.13 వేలు వంతున జమచేయనున్నారు. ఇదిలావుండగా తల్లికి వందనం పథకం అర్హులు, అనర్హుల జాబితాలు గ్రామ/వార్డు సచివాలయాలకు చేరాయి. అనర్హుల జాబితాలో పొరపాటున అర్హులు ఉంటే తమ అర్హతకు సంబంధించిన వివరాలు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే దరఖాస్తుదారు కుటుంబ ఆదాయం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పరిమితికి లోబడి ఉండాలి. ఇతర వివరాలకు సచివాలయాల్లో సంప్రతించాలని అధికారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్

(5వ పేజీ తరువాయి)

వెళ్లేసరికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఉంటుంది కాబట్టి, వాహన చోదకులకు సమయం ఆదా కావడంతోపాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీపీకి సూచించారు. రాష్ట్ర హోం మంత్రి స్వయంగా ఆదేశించడంతో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్‌పై సీపీ దృష్టిసారించారు. నగరంలో అన్ని కూడళ్ల వద్ద వాహనాల రద్దీని అధ్యయనం చేసి, ట్రాఫిక్ సింక్రనైజేషన్ సిస్టమ్ అమలు సాధ్యాసాధ్యాలపై ఒక ప్రైవేటు సంస్థకు చెందిన నిపుణులతో సీపీ చర్చించినట్టు తెలిసిందే. వారు ఇచ్చే నివేదిక ఆధారంగా ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ చేయడానికి అవకాశం ఉన్నట్టయితే సీఎస్ఆర్ నిధులతో ప్రాజెక్టును పూర్తిచేసే అవకాశం ఉందని పోలీస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కదలం.. విశాఖను వదలం

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగి పౌరసరఫరాల శాఖలో సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ కావాలని రాష్ట్రంలో అత్యంత కీలకమైన వ్యక్తి ద్వారా ఒత్తిడి తీసుకురాగా యంత్రాంగం సున్నితంగా తిరస్కరించింది. సివిల్ సరఫరాలో పనిచేస్తున్న ఉద్యోగికి రెవెన్యూలో కీలక మండలాంలో పోస్టింగ్ ఇస్తే అక్కడకు వెళ్లేదిలేదంటూ చెప్పడం రెవెన్యూ ఉద్యోగులు ఆక్షేపిస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు పనిచేయాలే తప్ప ..ఇలా ఒత్తిడి తీసుకురావడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. బదిలీలకు సంబంధించి వస్తున్న ఒత్తిళ్లపై జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలు చేపట్టామని, దీనికి సంబంధించి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయా చోట్ల విధుల్లో చేరాలే తప్ప మార్పులు చేర్పులకు తావులేదని స్పష్టంచేస్తోంది.

భూపరిపాలనా ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన గాజువాక తహశీల్దారు తోట శ్రీవల్లిని వీఎంఆర్‌డీఏకు, సీతమ్మధార తహశీల్దారు రమేష్‌ను ములగాడ తహశీల్దారుగా బదిలీ చేశారు. అయితే ఇరువురు ఆయా చోట్ల పనిచేయడానికి ఇష్టపడడం లేదని తెలిసింది. తిరిగి సీసీఎల్ఏకు వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారని అంటున్నారు. కాగా బదిలీ అయిన తహశీల్దార్లు, ఉద్యోగులు వెంటనే రిలీవ్ కావాలని జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు పెందుర్తి, ములగాడ తహశీల్దార్లు అక్కడ డీటీలకు బాధ్యతలు అప్పగించారు. మరో 30 మంది ఉద్యోగులు రిలీవ్ కాగా మిగిలినవారు కూడా ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు అప్పగించాలని యంత్రాంగం ఆదేశించింది.

జిల్లా పంచాయతీశాఖకు సంబంధించి ఉమ్మడి జిల్లా పరిధిలో మండల విస్తరణాధికారి నుంచి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి వరకూ 230 మందిని బదిలీ చేశారు. అయితే వీరిలో చాలామంది విశాఖ జిల్లాలోనే పనిచేస్తామని సిఫారసు లేఖలు తెచ్చుకున్నారు. కొందరైతే ఆనందపురం, పెందుర్తి మండలాల్లో పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని ఒత్తిడి తెచ్చారు. జల వనరుల శాఖలో ఇదే పరిస్థితి కొనసాగింది. ఒక సీనియర్ అసిస్టెంట్‌ను నగరం నుంచి విజయనగరానికి బదిలీ చేస్తే ఇక్కడ కొనసాగించాలని ఒత్తిడి తెచ్చారు. చోడవరం ప్రాంతం నుంచి ఎలమంచిలికి బదిలీ అయిన ఉద్యోగి కూడా విశాఖ కోసం పట్టుబట్టారు. ఇదిలావుండగా జిల్లా ఖజానా కార్యాలయంలో పలువురు ఉద్యోగులు పలు కారణాలతో విశాఖలోనే ఉండిపోయారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు వెళ్లకుండా ఉన్నత స్థాయిలో పైరవీ చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. నగరంలో కీలక పోస్టుల్లో పనిచేసి రెండేళ్ల క్రితం అనకాపల్లి జిల్లాకు వెళ్లి భారీగా అక్రమాలకు పాల్పడిన సీఐను ఇటీవల రేంజ్‌కు సరండర్ చేశారు. ప్రస్తుతం ఆయన సిటీలో పోస్టింగ్ కావాలంటూ అధికార పార్టీ కీలక నేత ద్వారా ఒత్తిడి తీసుకువస్తున్నారు.

ఫార్మాలో ప్రమాదాల పరంపర

(5వ పేజీ తరువాయి)

వెళుతున్నప్పుడు అక్కడ ఏ ప్రక్రియ జరుగుతున్నదో తెలుసు కాబట్టి దానికి తగిన రక్షణ పరికరాలు ధరించి వెళ్లాలి. అంటే మంచి మాస్క్ కచ్చితంగా ధరించాలి. అది విష వాయువుల నుంచి రక్షణ కల్పించేదై ఉండాలి.

● హెచ్2ఎస్‌ను వాసనను బట్టి గుర్తుపట్టవచ్చు. మ్యాన్‌హోల్ తెరిచి ఉంది కాబట్టి ఈటీపీ పైకి వెళుతున్నప్పుడే ఆ వాసన వస్తుంది. అంటే దానిని గుర్తు పట్టే స్థితితో సేఫ్టీ అధికారులు ఉండాలి. వారు ఆ వాసన గుర్తు పట్టి కిందికి దిగిపోవాలి. కానీ అలా చేసినట్టు లేదు.

● ప్రతి సంస్థ తయారుచేసే మందులను బట్టి 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)' పాటించాలి. మందుల తయారీ ప్రాంతంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సిబ్బందికి అవగాహన కల్పించి, తగిన భద్రతా పరికరాలు అందించాలి. అంటే మాస్క్‌లు, గ్లౌజులు, బూట్లు వంటివి అందులో భాగంగా ఉంటాయి.

ఏదో జరిగింది చెప్పడం లేదు

కంపెనీ యాజమాన్యం, పోలీసులు విషవాయువు లీకై దానిని పీల్చి చనిపోయారని చెబుతున్నారు. ఇంకే విషయాలు వెల్లడించ లేదు.

నిర్లక్ష్యం ఉందని అర్థమవుతోంది

ఈటీపీలోనే వ్యర్థాలను శుద్ధి చేయకూడదు. వేరే ట్యాంకులోకి తీసుకొని చేయాలి. కానీ వారు అలా చేయలేదు. పైగా మ్యాన్‌హోల్ తెరిచి ఉంచారు. అది మూసి ఉంటేనే ప్రక్రియ సజావుగా జరుగుతుంది. అక్కడ నిబంధనల ప్రకారం వ్యవహరించలేదు. నిర్లక్ష్యం ఉందని అర్థమవుతోంది. పైగా చనిపోయిన వారిలో ఒకరికి సేఫ్టీ విభాగంలో పదేళ్ల అనుభవం ఉంది.

-ముకుందరావు, ఈఈ

కాలుష్య నియంత్రణ మండలి

స్పందించని ఫ్యాక్టరీస్ విభాగం

ఈ ప్రమాదంపై వివరాలు తెలుసుకోవడానికి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి పరమేశ్వరరావుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత వారిదే. ఈ విభాగం పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. భద్రతా విభాగంలో పనిచేసే వారికి మళ్లీ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని అర్థమవుతోంది.




మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ జడ్జి వల్లభనాయుడు

బాల కార్మికులు లేని సమాజమే లక్ష్యం

డాబాగార్డెన్స్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మికులు లేని సమాజమే అందరి లక్ష్యం కావాలని విశ్రాంత ప్రిన్సిపాల్ జడ్జి జి. వల్లభనాయుడు అన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా కార్మిక శాఖ, విద్యా శాఖ, యాక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ అప్ హోల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు కార్మికులుగా మారడానికి తల్లిదండ్రులు కూడా కారణమన్నారు. నిరక్షరాస్యత, ఆర్థిక పరిస్థితులు వల్ల చాలామంది బాలలు పనులకు వెళ్తున్నారని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ లేబర్ సునీత మాట్లాడుతూ బాల కార్మికులను రెస్క్యూ చేయడంలో లేబర్ శాఖ, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ టు జిల్లా కో ఆర్డినేటర్ జి. డేవిడ్‌రాజు, డీసీపీఓ మమత, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు తొలి అడుగు



సమావేశంలో మాట్లాడుతున్న పాలమరశెట్టి శ్రీనివాసరావు

మహారాణిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలు రాక్షస పాలన నుంచి విముక్తి పొంది, సుపరిపాలనలోకి వచ్చారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల విధ్వంసకర పాలనకు ప్రజలు చమరగీతం పాడి, సుపరిపాలనకు నాంది పలికిన రోజుని రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు పార్టీ నాయకులు పి. జ్యోతీష్ కుమార్, పి. శ్రీనివాసరావు ఉన్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడా మండప ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

అలంకారప్రాయంగా సిగ్నల్ లైట్లు

» ప్రధాన కూడళ్లల్లో కానరాని ట్రాఫిక్ రూల్స్
» ఇష్టానుసారం వాహనదారుల రాకపోకలు
» తరచూ ప్రమాదాలతో భయాందోళన



పాత సరస్వతీ థియేటర్ జంక్షన్ వద్ద దుస్థితి

డాబాగార్డెన్స్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డులోని పలు కూడళ్లలో ట్రాఫిక్ ఇండికేషన్ లైట్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. ముఖ్యంగా సరస్వతీ పార్కు జంక్షన్, డాబా గార్డెన్స్ జంక్షన్, డాబా గార్డెన్స్ ఎల్ఐసీ అంబేడ్కర్ సర్కిల్ ప్రాంతాల్లో ఒక్క లైట్ కూడా వెలగకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో వాహనదారులు అంబేడ్కర్ సర్కిల్, డాబాగార్డెన్స్ జంక్షన్, సరస్వతీ పార్కు జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. నాలుగు వైపులా కూడళ్లు ఉండడం, సిగ్నల్ లైట్లు లేకపోవడంతో ఎవరికి వారు ఇష్టానుసారంగా వచ్చేస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కనీసం ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా లేకపోవడంతో సమస్య మరింత జటిలంగా తయారైంది. కొందరు కూడళ్ల వద్ద తోపుడు బళ్లతో వ్యాపారాలు చేస్తుండడంతో వాహనదారులకు ఎటు వెళ్లాలో తెలియక తికమకపడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సిగ్నల్ లైట్లు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అంబేడ్కర్ జంక్షన్ నుంచి జైల్ రోడ్డుకు వెళ్లే మార్గంలో వెలగని సిగ్నల్ లైట్లు

అప్పన్నను దర్శించుకున్న ఐటీ శాఖ చీఫ్ కమిషనర్

సింహాచలం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదాయ పన్ను శాఖ చీఫ్ కమిషనర్ శ్రీనివాస్ దండా సతీసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి, శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.



స్తంభం వద్ద ఐటీ కమిషనర్ దంపతులు

16, 17 తేదీల్లో పైడిమాంబ పండుగ

మాధవధార, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తరంలోని 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ వాసుల ఆరాధ్య దేవత పైడిమాంబ అమ్మవారి పండుగ ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆది ఆంధ్రసేవా సంఘం సభ్యులు తెలిపారు. ఆర్అండ్‌బీ జంక్షన్‌లోని ఆలయంలో ఉత్సవ ఏర్పాట్లు చేపడుతున్నారు. 16న తొలేళ్లు జరుగుతాయి. భక్తులు అమ్మవారి ఘటాలు, ఉత్సవ ప్రతిమలతో ఊరేగింపుగా వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. 17న ప్రధాన పండుగ నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల దర్శనానికి క్యూలైన్లు, ఉత్సవం రోజు అర్చనలు, పూజాదికాలకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం గ్రామంలో సాంస్కృతిక ప్రదర్శనలు, లైటింగ్, పోలీసు భద్రతకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మృతుల కుటుంబాల్లో విషాదం

మహారాణిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని సాయిశ్రేయాస్ ఫార్మాస్యూటికల్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో విష వాయువులు పీల్చడంతో మృతి చెందిన చంద్రశేఖర్, కుమార్ మృతదేహాలకు కేజీహెచ్‌లో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన చంద్రశేఖర్ కొంతకాలంగా భార్య అనూషా, కుమార్తె దర్శితో కలిసి అగనంపూడిలో నివాసం ఉంటున్నాడు. చంద్రశేఖర్ మృతితో భార్య బంధువులు, కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అలాగే కుమార్‌కు తల్లిదండ్రులు లేరు. సోదరుడు మాత్రమే ఉన్నారు. ఏడాది క్రితం ఉద్యోగం రావడంతో మాధురితో వివాహం జరిగింది. కుమార్ మృతితో మాధురి విలపిస్తున్న తీరు పలువుర్ని కంటతడి పెట్టించింది.

ప్రగతిపథం వైపు ఏడాది పాలన

» సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం అంటూ కొనియాడిన నేతలు » కూటమి పాలన సంవత్సరం పూర్తవడంతో పలు ప్రాంతాల్లో సంబరాలు



మద్దిలపాలెం : 22వ వార్డులో నిర్వహించిన వేడుకల్లో కేకు కట్ చేస్తున్న టీడీపీ నేతలు



ఆరిలోవ : 12వ వార్డులో జరిగిన వేడుకల్లో కేకు కట్ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, పాల్గొన్న నేతలు



ఎంవీపీ కాలనీ : హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలలో వికలాంగులకు అన్నదానం నిర్వహిస్తున్న తెలుగుదేశం నాయకులు

మద్దిలపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తి అయిన సందర్భంగా జీవీఎంసీ 22వ వార్డులో గురువారం టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ఏడాది పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టి సందడి చేశారు. అనంతరం బొట్టా వెంకటరమణ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచి అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. అన్న క్యాంటీన్లు ప్రారంభించి పేదలకు భోజనం అందించారన్నారు. పింఛన్లు పెంచి ఎంతోమంది లబ్దిదారులకు ఆదుకున్నారన్నారు. కంపెనీలు తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పించారన్నారు. తల్లికి వందనం అమలు చేసి పేద విద్యార్థులకు బాసటగా నిలిచారన్నారు. ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు దువ్వి వెంకటస్వామి, ఒమ్మి అప్పారావు, దువ్వి రాజ్‌కుమార్, డొక్కరి శ్రీనివాసరావు, కోడిబోయిన ఆనంద్, వెంకటప్రసాద్, దేవర రఘు, గణేష్, తాతారావు, అప్పారావు, దువ్వి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా పేదలకు మేలు చేయడం జరిగిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు అన్నారు. గురువారం తోటగరువులో గల టీడీపీ 12వ వార్డు కార్యాలయంలో కూటమి పాలన ఏడాది పండుగను నిర్వహించారు. భారీ కేకును కట్ చేశారు. అనంతరం సన్యాసిరావు మాట్లాడుతూ.. అధికారం వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని రూ.3 వే నుంచి రూ.4 వేల చేయడం ద్వారా ఎంతో మేలు జరిగిందన్నారు. అలాగే డీఎస్సీ నిర్వహణ, నిరుద్యోగులకు ఉపాధి లభించేలా రాష్ట్రంలో పలు ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రయత్నాలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం వంటివి రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

ఈ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షుడు గాడి సత్యం, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, నాయకులు గోపి, బవవ దేవుళ్లు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అలాగే టీడీపీ 10వ వార్డు ఇన్‌చార్జి మద్దిల రాజశేఖర్ ఆధ్వర్యంలో కేకును కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, మద్దిల శేఖర్, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :కూటమి ప్రభుత్వం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఉషోదయ కూడలిలోని హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలలో తెలుగుదేశం నాయకులు సంబరాలు నిర్వహించారు. దివ్యాంగులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం కేకు కట్ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి, నాయకులు సత్తిబాబు, శివరెడ్డి, సీతన్నరెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలనీ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

పారిశుధ్య సిబ్బంది స్పందించి తక్షణమే తొలగింపునకు చర్యలు తీసుకోవడంతో వాహనదారుల ఊరట



రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు



నీటి తొలగింపునకు చర్యలు తీసుకొంటున్న పారిశుధ్య సిబ్బంది

వెంకోజీపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గురువారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు 15వ వార్డు హెచ్‌బీ కాలనీ స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను గుయ్యారు. ఈ నేపథ్యంలో 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్, శుభ్రం మేస్త్రి రమణ సిబ్బందితో వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే ఫుట్‌పాత్ కింద ఉన్న కాలువలోకి నీరు వెళ్లేలా ఏర్పాటు చేసిన రంధ్రానికి అడ్డంగా ఉన్న చెత్తను తొలగించి, సత్వరమే నిలిచిపోయిన నీటిని తొలగింపజేశారు. దీంతో రోడ్డుపై నిలిచిపోయిన వాహనచోదకులు, పాదచారులు ఉపశమనం పొందారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

గత ప్రభుత్వ హయాంలో చేసిన అనాలోచిత, హడావుడి నిర్మాణం కారణంగా చిన్న వర్షం వచ్చినా ఈ ప్రాంతంలో నీరు నిలిచిపోవడం, పారిశుధ్య సిబ్బంది వచ్చి తాత్కాలికంగా తొలగిస్తున్నారు తప్ప అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని హెచ్‌బీ కాలనీ శాఖ సీపీఐ కార్యదర్శి పడాల గోవింద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మోడ్రన్ ఫుట్‌పాత్‌లను నిర్మించడం వలన మార్గానికి అందం అయితే వచ్చింది గానీ నిర్మాణం చేపట్టేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో సమస్య ఉత్పన్నమైందని మండిపడ్డారు. అర కిలోమీటరు మేర ఫుట్‌పాత్ కింద కాలువకు నీరు వెళ్లేందుకు ఒకే ఒక రంధ్రం ఏర్పాటు చేస్తే సమస్యకు ఎలా శాశ్వత పరిష్కారం లభిస్తుందని గోవింద్ ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం వారు మరిన్ని ఫుట్‌పాత్‌లకు రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోకుండా కాలువలోకి సులభంగా వెళ్లేందుకు మరిన్ని రంధ్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాఏగ ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను కూడా తొలగించే చర్యలు కూడా అవసరమని సూచించారు.

రెండు పిల్లలను ఈనిన మౌస్ డియర్

ఆరిలోవ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో మౌస్ డియర్ (మూసిక జింక) రెండు పిల్లలకు, రెడ్ నెక్డ్ వాలబీ ఒక పిల్లకు జన్మ ఇచ్చినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఈ రెండు జంతువులకు ఇదే తొలి సంతానం అని చెప్పారు. పిల్లల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసు కొంటున్నట్టు జ్యూ రేటర్ తెలిపారు.



పిల్లలతో మౌస్ డియర్

ఏయూ బ్రాండింగ్ అండ్ మీడియా అసోసియేట్

డీన్‌గా సాల్మన్ బెన్నీ

వెంకోజీపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :ఏయూ ఔట్రీచ్ బ్రాండింగ్ అండ్ మీడియా అసోసియేట్ డీన్‌గా నియమితులైన ఆంగ్ల విభాగం ఆచార్యులు డాక్టర్ ఎన్.సాల్మన్ బెన్నీ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్ అండ్ మీడియా రిలేషన్స్ డైరెక్టర్, జర్నలిజం ఆచార్యులు చల్లా రామకృష్ణ ఆచార్య బెన్నీకి బాధ్యతలు అప్పజెప్పారు.



సాల్మన్ బెన్నీని సత్కరిస్తున్న ఆచార్య చల్లా రామకృష్ణ

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

ఎంవీపీ కాలనీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం ద్వారా మరింత ప్రచారం చేసి, తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేలా ప్రోత్సహించాలని 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలతో పాటు మంచి విద్య అందుబాటులో ఉందన్నారు. ఫిషర్‌మెన్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం నిర్వహించి, పిల్లలకు పలకలు, మిఠాయిలు పంచిపెట్టారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఎంవీపీ కాలనీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : 11కేవీ సెక్టర్ 6, సెక్టర్ 1 ఫీడర్‌పై నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-1 ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మెడికవర్ వెనుక గేటు ప్రాంతం, అంజయ్యనగర్, ఎంవీపీ 1, 2, 6 సెక్టర్లు, సాయిబాబా ఆలయం రోడ్డు, శ్యామలా డ్రైఫ్రూట్స్ ఎదురు వీధి తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమన్వయంతో పార్టీ పటిష్టానికి కృషిచేయండి : మాజీ మంత్రి అమర్‌నాథ్

మద్దిలపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ పటిష్టతకు పని చేయాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. మద్దిలపాలెం పార్టీ వైసీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన తూర్పు నియోజకవర్గం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు సమన్వయకర్తగా నియమించిన మొల్లి అప్పారావు సారథ్యంలో కూటమి ప్రభుత్వం పాల్పడుతున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. భేదాభిప్రాయాలు లేకుండా సమన్వయకర్తతో కలిసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయమే ధ్యేయంగా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం బెదిరింపులకు లొంగకుండా ప్రజల పక్షాన నిలబడాలన్నారు. అనంతరం గుడివాడ అమర్‌నాథ్‌ను మొల్లి అప్పారావు సన్మానించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పూర్తి న్యాయం చేస్తానన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు రవిరెడ్డి, పల్లా దుర్గారావు, పీతల గోవింద్, బోని శివరామకృష్ణ, సురేష్, విజయచందర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సన్మానిస్తున్న మొల్లి అప్పారావు, పాల్గొన్న వైసీపీ నేతలు, కార్యకర్తలు

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 26, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 16, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 16, క్యారెట్ 44 దొండకాయలు 20, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)52, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 70,బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 95, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 30, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

యోగాంధ్రలో అందరూ భాగస్వామ్యం కావాలి : ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తూర్పు నియోజకవర్గం శాశనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు. ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టరు వీఎమ్మార్డీఏ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన ఆయన.. అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడమే కాకుండా, ప్రజలందరినీ ఇందులో భాగస్వామ్యులుగా చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఒమ్మి సన్యాసిరావు, చోడె పట్టాభిరాం, కార్పొరేటర్లు అప్పారి శ్రీవిద్య, మూర్తి యాదవ్, లావణ్య, సునీత, మంగవేణి, కాళ్ల శంకర్, పోతనరెడ్డి, రాజశేఖర్, ధనరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పాల్గొన్న నేతలు

సమస్యల పరిష్కారం కోరుతూ విమ్స్ వైద్యుల నిరసన

ఆరిలోవ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిపై సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సర్వీసు రెన్యువల్ చేసి వేతనాలు పెంచాలని కోరుతూ పలువురు వైద్యులు గురువారం ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కాంట్రాక్టు పద్ధతిలో వైద్యులను ఇక్కడ నియమించారని, ఆ తర్వాత తమ గురించి పట్టించుకోవడమే మానేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లకార్డులు పట్టుకొని తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఇక్కడ సేవలు అందిస్తున్న వారంతా స్పెషలైజేషన్ చేసిన వారేనని, అయితే ఎంబీబీఎస్ వైద్యుల వేతనాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విమ్స్‌లో 42 మంది వైద్యులు ఈ విధానంగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. తాము సంపూర్ణ సేవలు అందిస్తున్నా, గుర్తింపు లేకపోవడం అన్యాయమన్నారు. 2022, జనవరి 4 నుచి కాంట్రాక్టు పద్ధతిపై నెలకు రూ. 92 వేలకే పని చేస్తున్నామని చెప్పారు . గత ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రికి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించామని, కానీ ఎలాంటి స్పందన లేకుండా పోయిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనైనా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.



ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

తొలి రోజు విద్యార్థుల హాజరు అంతంతే..

» వేసవి సెలవుల అనంతరం తెరచుకున్న పాఠశాలలు



స్కూలుకు పరిమితంగా హాజరైన విద్యార్థులు

ఆరిలోవ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు గురవారం పునః ప్రారంభమయ్యాయి. అయితే తొలి రోజు విద్యార్థులు అతి తక్కువగా హాజరయ్యారు. తమ స్కూలుకు సుమారు 20 శాతం మంది మాత్రం హాజరైనట్టు తోటగరువు జిల్లా పరిషత్తు ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవానీ తెలిపారు. 1100 మంది విద్యార్థులకు సుమారు 200 మంది మాత్రం హాజరయ్యారని తెలిపారు. వీరిలో మధ్యాహ్న భోజనానికి సుమారు 150 మంది హాజరయ్యారు. అందరికీ సన్నబియ్యం భోజనం పెట్టినట్టు హెచ్‌ఎం చెప్పారు. గుడ్లు ఇంకా సరఫరా కాకపోవడంతో కూరగాయలతో భోజనం పెట్టారు. విద్యార్థులకు అందజేయాల్సిన కిట్స్ శుక్రవారం అందించినట్టు ఆమె వెల్లడించారు. అలాగే శ్రీ కృష్ణాపురం అంబేడ్కర్ గురుకులానికి సుమారు 450 మంది విద్యార్థులకు 49 మంది విద్యారులు హాజరయ్యారైనట్టు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు.

వేతనాలు పెంచరూ..

» మేయర్‌కు జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ డ్రైవర్ల వినతి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు

వెంకోజీపాలెం/ సిరిపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు పెంచాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మేయర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. జీవీఎంసీలో ఎన్నో ఏళ్లగా ఇంజనీరింగ్ విభాగం, ఇతర ఉన్నతాధికారుల వద్ద ఉదయం నుంచి రాత్రి వరకూ విధులు సక్రమంగా నిర్వహిస్తూ, ఏ అధికారికీ ఎలాంటి ఆటంకం కలగకుండా పని చేస్తున్న తమకు ఎటువంటి గుర్తింపు లేదని, జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగం డ్రైవర్లు, వర్కర్లకు వేతనాలు పెరిగాయని, వారి వేతనాలతో పాటు ఇంజనీరింగు విభాగం అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకూ సమాన వేతనం రూ.24,500 పెంచేలా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగం డ్రైవర్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవుట్‌సోర్సింగ్‌లోని ఇంజనీరింగ్ విభాగం డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న జీతభత్యాలను పరిశీలించి తగిన న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్‌ను అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

విజ్ఞానదాయంకంగా రోబోకాన్-2025 సదస్సు



సదస్సులో పాల్గొన్న ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు

రామ్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో ఉత్తరాంధ్ర ఆర్థోపెడిక్ అసోషియేషన్ రోబోకాన్-2025 పేరుతో వైద్య విద్యా సదస్సును నిర్వహించారు, రోబోట్ ఆధారిత మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సపై అవగాహన కల్పిస్తూ గురువారం రామ్‌నగర్‌లో ఒక హోటల్‌లో ఈ సదస్సును నిర్వహించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ సౌరబ్ ఎస్ కులకర్ణి, డాక్టర్ కేజే రెడ్డి, డాక్టర్ ఎంవీ సుధాకర్ చర్చా కార్యక్రమంలో రోబోటిక్ టోటల్ నీ జాయింట్ రీప్లేస్‌మెంట్, సాంకేతిక విధానాలపై అవగాహన కలిగించారు. ఆర్థో ప్లాస్టీ వంటి క్లినికల్ అంశాలపై శాస్త్రీయ, విలువైన అంశాలను వివరించారు. సదస్సులో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ గంగావరపు శ్రీధర్ డాక్టర్. అరుణకుమార్ తదితరులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 కి పైగా ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేశామని సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. పూరి - యశ్వంత్‌పూర్ -పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు (22883/22884) ఈనెల 27 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్, సంబల్‌పూర్-నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు (20809/20810) ఆగస్టు 1 వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్, సంబల్‌పూర్-ఇరోడ్-సంబల్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08311/08312) ఈనెల 27 వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్, విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్‌కు (58506/ 58505) ఈనెల 30 వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్, విశాఖ-బెంగళూరు-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08581/08582) ఈనెల 30 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్, విశాఖ-తిరుపతి-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08547/08548) ఈనెల 26 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్, విశాఖ-చర్లపల్లి-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08579/08580) ఈ నెల 28 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేయనున్నట్టు తెలిపారు.

షిప్‌యార్డు కాలనీలో యోగా శిక్షణ ప్రారంభం

మల్కాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని షిప్‌యార్డు కాలనీలో 12 నుంచి 21 వరకు యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం మొదలైన కార్యక్రమానికి సీఎండీ మహాపాత్ర జీఎం(టెక్) ముఖ్యఅతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని అన్నారు. ఒక భూమి యోగా, ఒక ఆరోగ్యం అనే ఇతివృతంపై కూడా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కుటుంబాలతో పాల్గొన్నారు. వీరికి అంతర్జాతీయ యోగా గురువు రాజన ఉమా కృష్ణ శిక్షణ ఇస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌కు అదనపు బాధ్యతలు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జీవీఎన్.ప్రసాద్‌కు ప్రస్తుతం ఉన్న డైరెక్టర్ (ఫైనాన్స్) బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ అండర్ సెక్రటరీ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టుకు గతంలో ఇంటర్వ్యూ జరిగినా ఎవరిన్ని ఎంపిక చేయకపోవడంతో ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆగస్టు 1నుంచి వచ్చే ఏడాది జనవరి 31వరకు ఆయన అదనపు బాధ్యలు సీకరిస్తారని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఘనంగా పరదేశమ్మ ఉత్సవం



గోపాలపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపాలెం గ్రామంలో కొలువైన శ్రీ పరదేశమ్మ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేకువజాము నుంచి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిలిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహా-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహా-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 26, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 16, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 16, క్యారెట్ 44 దొండకాయలు 20, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 52, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 95, కొబ్బరి కాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 86, కీరదోస 30, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిదగుమ్మడికాయ 20, క్యాప్సికం... క్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194



స్తంభం వద్ద ఐటీ కమిషనర్ దంపతులు

అప్పన్నను దర్శించుకున్న ఐటీ శాఖ చీఫ్ కమిషనర్

సింహాచలం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదాయ పన్ను శాఖ చీఫ్ కమిషనర్ శ్రీనివాస్ దండా సతీసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు సత్కరించారు.

రైల్వే ఆసుపత్రిలో ఆధునిక వైద్య వసతులు



ఆసుపత్రిలో యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని వాల్తేరు డివిజన్ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టెరిలైజేషన్, ఫిజియోథెరపీ లేజర్ యూనిట్లను డీఆర్‌ఎం లలిత్ బొహ్రా, వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా గురువారం ప్రారంభించారు. రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉన్నత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. క్రిమి రహితం చేయడానికి, కండరాలు, కణజాల నొప్పులతో బాధపడుతున్నవారు వేగంగా కోలుకోవడానికి ఆధునిక యంత్రపరికరాలు ఉపయోగపడతాయని డీఆర్‌ఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం ఈ.శాంతారామ్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా కూటమి ఏడాది సంబరాలు



ప్రభుత్వానికి ఏడాది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి. గణబాబు తనయుడు మౌర్యసింహా

గాజువాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా గాజువాక టీడీపీ కార్యాలయంలో గురువారం సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా సుపరిపాలనకు ఏడాది పోస్టర్‌ను స్థానిక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హింస, అవినీతి, అరాచకాలు పోవాలని, మంచి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు భావించి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి సంక్షేమమే కూటమి లక్ష్యమని డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మల్కాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తోందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్యసింహ పేర్కొన్నారు. జీవీఎంసీ 58వ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఏడు వార్డుల టీడీపీ నాయకులతో కూటమి ఏడాది పాలన సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మౌర్యసింహ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, అందుకు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. పాలనలో చంద్రబాబు నాయుడుకు అపారమైన అనుభవం ఉందని అన్నారు. విద్యార్థులకు గురువారం అమ్మకు వందనం కానుకు అందజేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపిల్లి (చిన్న), పలువురు టీడీపీ వార్డు అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిపూర్తి చేసుకున్న సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కేంద్ర కార్యాలయంలో సూపరిపాలన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పెందుర్తిరూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జీవీఎంసీ 97వ వార్డు పరిధి సుజాతనగర్ బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు గురువారం సంబరాలు చేసుకున్నారు. వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చిక్కాల సతీష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

పెదగంట్యాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర (ఎస్‌ఆర్‌కేవీఎం) కిట్లు పంపిణీ చేశారు. ఎస్‌ఆర్‌కేవీఎం కిట్‌లో విద్యార్థి తరగతికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, బెల్టు ఉన్నాయి. మండలంలో 32 ప్రాథమిక, 3 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3,664 మంది విద్యార్థులు ఉన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం రోజు అంటే గురువారం పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు.

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థికి కిట్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్

విజ్ఞాన్ ఇంజనీరింగ్ విద్యార్థినులకు కొలువులు

అగనంపూడి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 38మంది విద్యార్థులకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ కాగ్నిజెంట్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. వీరిలో ఇద్దరు రూ.6.75 లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాలకు మరో 36 మంది రూ.4 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆమె చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను గురువారం కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొదటి ఏడాదినుంచే కోడింగ్, కమ్యూనికేషన్ నైపుణ్యంపైశిక్షణ వంటి జాబ్స్ స్కిల్స్ అందించడం వల్ల తమ విద్యార్థులు ప్రతిభ చూపి ఉద్యోగాలు సాధించారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాల పంపిణీ



మోడల్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

వేపగుంట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలల ప్రారంభం రోజే స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా వసతులు కల్పిస్తున్నారని అన్నారు. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఉన్న విద్యార్థులకు రూ.15వేలు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో అచ్చు పుస్తకాల పంపిణీ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినడకలో ప్రభుత్వ మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు గురువారం అచ్చు పుస్తకాలను పంపిణీ చేశారు. 1 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల హెచ్‌ఎం శివాజీ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలి

▸▸ఏఐటీయూసీ డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలకు ఏఐటీయూసీ గురువారం టీటీఐ జంక్షన్ వద్ద నిరసన తెలిపింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి. ఆదినారాయణ మాట్లాడుతూ దేశంలో ఉన్న స్టీల్ ప్లాంటుల్లో కార్మికులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, తొలగించిన కార్మికులను ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

'కులగణన సర్వేలో పద్మశాలీలు పాల్గొనాలి'



పద్మశాలీ కులగణన సర్వేలో పాల్గొన్న పప్పు రాజారావు

ఆటోనగర్,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీ కులగణన సర్వేలో అర్హులు పాల్గొనాలని 71వ వార్డు శ్రీనగర్‌కు చెందిన ఏపీ పద్మశాలి సంఘం కన్వీనర్ పప్పు రాజారావు పేర్కొన్నారు. గురువారం విశాఖ నగరంలో పద్మశాలి గ్లోబల్ యాప్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశాఖ నగరం నుంచి ఈ సర్వేను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. పద్మశాలీలు సంఖ్యా బలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలనే లక్ష్యంతో ఈ ప్రయత్నం మొదలు పెట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కుల పెద్దలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించరూ!

▸▸ఈపీఎఫ్ కార్యదర్శికి ఇంటక్ నాయకుల వినతి



ఈపీఎఫ్ కార్యదర్శి రామ్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ ఈపీఎఫ్ కార్యదర్శి రామ్‌ప్రసాద్‌కు గురువారం ఇంటక్ అధ్యక్షుడు పీవీ.రమణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్‌ఆర్‌ఎల్ 90శాతం లోన్స్ పునరుద్ధరించాలని, వీపీఎఫ్‌ను రీఓపెన్ చేయాలని, హయ్యర్ పెన్షన్‌కు ఆర్థిక ఇబ్బందులు వల్ల కట్టలేని వారికి మరల డిమాండ్ నోటీసులు పంపాలని, కార్మికులకు అందుబాటులో ఉండే పేసెక్షన్‌ను మార్చవద్దని కోరారు.

'పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్తు'

గాజువాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్ ఉంటుందని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాక పాతకర్నవానిపాలెంలో గురువారం అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏదో ఒక సందర్భంలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. యువత మొక్కలు నాటడాని ఓ అలవాటుగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, రంగనాయకులు, మనోహర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం, ప్రశాంతత

శ్రీనగర్,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి, భావోద్వేగాలను అధిగమించి ప్రశాంతమైన వాతావరణం పొందవచ్చని టీఎస్‌ఆర్ టీబీకే కళాశాల చైర్మన్ తలశిల బలరామ కృష్ణ అన్నారు. శ్రీనగర్ కళాశాలలో గురువారం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు 'నీతి-నైతిక' విలువలు అనే అంశం పై ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయనన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజయోగ శిక్షణ నిపుణురాలు సిస్టర్ బికె హరిత, సోమేశ్వరిలు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పై ఉందనీ, అన్నారు. యోగా, ధ్యానం, సేవ, కృషి, జ్ఞానం అనే అంశాలు పై ఉపాధ్యాయులకు స్పష్టత ఉండటం ద్వారా విద్యార్థుల్లో ప్రతికూలతలను పారద్రోలి, అనుకూలతలను సాధించడానికి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తలశిల ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపల్స్ ఎస్.విష్ణువర్ధన్, జయశ్రీ శర్మ, వైస్ ప్రిన్సిపల్ భారతి, అట్లూరి సుభాషిణి, శ్రీనువాసరావు, విజయ పాల్గొన్నారు.

జీవీఎంసీ పాఠశాలలు కళకళ



ప్రధానోపాధ్యాయిని లక్ష్మీనరసను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో జీవీఎంసీ పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. సీతంపేట మధురానగర్‌లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రవేశాలకు విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. తొలి రోజునే 73 మంది విద్యార్థులు కొత్తగా చేరినట్లు హెచ్‌ఎం లక్ష్మీనరస తెలిపారు. గతంలో 19 మంది ఉపాధ్యాయులు ఉండగా ముగ్గురు తప్ప అందరూ కొత్త టీచర్లు వచ్చారని ఆమె తెలిపారు. వీరికి అదనంగా ఒక పీఈటీ, తెలుగు టీచర్ పోస్టు మంజూరయ్యాయన్నారు. వారిద్దరూ చేరవలసి ఉందన్నారు. మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో 26 మంది విద్యార్థులు కొత్తగా చేరినట్లు హెచ్‌ఎం దేముడు బాబు తెలిపారు. కొత్తగా చేరిన ఉపాధ్యాయులతో హెచ్‌ఎంలు సమావేశాన్ని నిర్వహించి విద్యార్థులకు మంచి బోధన అందించాలని, పాఠశాల, తరగతుల నిర్వహణ చక్కగా నిర్వర్తించాలని సూచించారు. ఉపాధ్యాయులంతా ప్రధానోపాధ్యాయులకు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తామన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు 50 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి నూతన ఉపాధ్యాయులు పాఠాలు చెప్పారు. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధా కుమారికి బదిలీపై వచ్చిన నూతన ఉపాధ్యాయులు శాలువా కప్పి సత్కరించారు. వీరందరికీ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారి ఎంఎన్‌వీ విశ్వనాథం, పీడీ ఎ.సునంద్, సీఆర్పీ భాగ్యలక్ష్మి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు స్వాగతం పలికారు.

పాఠశాలలు పునఃప్రారంభం

(5వ పేజీ తరువాయి)

నాణ్యమైన బియ్యం సరఫరా చేయడంతో టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. గురువారం సన్న బియ్యంతో తయారుచేసిన ఆహారాన్ని పిల్లలకు వడ్డించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి, అడవివరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు అన్నారు.

తల్లికి వందనం

(5వ పేజీ తరువాయి)

రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' పథకం కింద అందజేస్తామని కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు గురువారం మార్గదర్శకాలు జారీచేసింది. విశాఖ జిల్లాలో 1,90,433 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులుగా అధికారులు గుర్తించారు. వీరికి సంబంధించి 1,30,706 మంది తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు వంతున రూ.247.62 కోట్లు జమ చేస్తారు. ఇవి శుక్రవారం సాయంత్రంలోగా జమ అవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. కాగా గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభించారు. అంటే ఒకటో తరగతిలో విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. ఇంకా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఒకటో తరగతి, ఇంటర్ ప్రథమ ఏడాదిలో ప్రవేశాల ప్రక్రియ పూర్తయిన తరువాత ఆయా విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద రూ.13 వేలు వంతున జమచేయనున్నారు. ఇదిలావుండగా తల్లికి వందనం పథకం అర్హులు, అనర్హుల జాబితాలు గ్రామ/వార్డు సచివాలయాలకు చేరాయి. అనర్హుల జాబితాలో పొరపాటున అర్హులు ఉంటే తమ అర్హతకు సంబంధించిన వివరాలు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే దరఖాస్తుదారు కుటుంబ ఆదాయం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పరిమితికి లోబడి ఉండాలి. ఇతర వివరాలకు సచివాలయాల్లో సంప్రతించాలని అధికారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్

(5వ పేజీ తరువాయి)

వెళ్లేసరికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఉంటుంది కాబట్టి, వాహన చోదకులకు సమయం ఆదా కావడంతోపాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీపీకి సూచించారు. రాష్ట్ర హోం మంత్రి స్వయంగా ఆదేశించడంతో ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్‌పై సీపీ దృష్టిసారించారు. నగరంలో అన్ని కూడళ్ల వద్ద వాహనాల రద్దీని అధ్యయనం చేసి, ట్రాఫిక్ సింక్రనైజేషన్ సిస్టమ్ అమలు సాధ్యాసాధ్యాలపై ఒక ప్రైవేటు సంస్థకు చెందిన నిపుణులతో సీపీ చర్చించినట్టు తెలిసిందే. వారు ఇచ్చే నివేదిక ఆధారంగా ట్రాఫిక్ సిగ్నల్స్ సింక్రనైజేషన్ చేయడానికి అవకాశం ఉన్నట్టయితే సీఎస్‌ఆర్ నిధులతో ప్రాజెక్టును పూర్తిచేసే అవకాశం ఉందని పోలీస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కదలం.. విశాఖను వదలం

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగి పౌరసరఫరాల శాఖలో సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ కావాలని రాష్ట్రంలో అత్యంత కీలకమైన వ్యక్తి ద్వారా ఒత్తిడి తీసుకురాగా యంత్రాంగం సున్నితంగా తిరస్కరించింది. సివిల్ సరఫరాలో పనిచేస్తున్న ఉద్యోగికి రెవెన్యూలో కీలక మండలాంలో పోస్టింగ్ ఇస్తే అక్కడకు వెళ్లేదిలేదంటూ చెప్పడం రెవెన్యూ ఉద్యోగులు ఆక్షేపిస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు పనిచేయాలే తప్ప ..ఇలా ఒత్తిడి తీసుకురావడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. బదిలీలకు సంబంధించి వస్తున్న ఒత్తిళ్లపై జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీలు చేపట్టామని, దీనికి సంబంధించి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయా చోట్ల విధుల్లో చేరాలే తప్ప మార్పులు చేర్పులకు తావులేదని స్పష్టంచేస్తోంది.

భూపరిపాలనా ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన గాజువాక తహశీల్దారు తోట శ్రీవల్లిని వీఎంఆర్‌డీఏకు, సీతమ్మధార తహశీల్దారు రమేష్‌ను ములగాడ తహశీల్దారుగా బదిలీ చేశారు. అయితే ఇరువురు ఆయా చోట్ల పనిచేయడానికి ఇష్టపడడం లేదని తెలిసింది. తిరిగి సీసీఎల్ఏకు వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారని అంటున్నారు. కాగా బదిలీ అయిన తహశీల్దార్లు, ఉద్యోగులు వెంటనే రిలీవ్ కావాలని జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు పెందుర్తి, ములగాడ తహశీల్దార్లు అక్కడ డీటీలకు బాధ్యతలు అప్పగించారు. మరో 30 మంది ఉద్యోగులు రిలీవ్ కాగా మిగిలినవారు కూడా ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు అప్పగించాలని యంత్రాంగం ఆదేశించింది.

జిల్లా పంచాయతీశాఖకు సంబంధించి ఉమ్మడి జిల్లా పరిధిలో మండల విస్తరణాధికారి నుంచి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి వరకూ 230 మందిని బదిలీ చేశారు. అయితే వీరిలో చాలామంది విశాఖ జిల్లాలోనే పనిచేస్తామని సిఫారసు లేఖలు తెచ్చుకున్నారు. కొందరైతే ఆనందపురం, పెందుర్తి మండలాల్లో పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని ఒత్తిడి తెచ్చారు. జల వనరుల శాఖలో ఇదే పరిస్థితి కొనసాగింది. ఒక సీనియర్ అసిస్టెంట్‌ను నగరం నుంచి విజయనగరానికి బదిలీ చేస్తే ఇక్కడ కొనసాగించాలని ఒత్తిడి తెచ్చారు. చోడవరం ప్రాంతం నుంచి ఎలమంచిలికి బదిలీ అయిన ఉద్యోగి కూడా విశాఖ కోసం పట్టుబట్టారు. ఇదిలావుండగా జిల్లా ఖజానా కార్యాలయంలో పలువురు ఉద్యోగులు పలు కారణాలతో విశాఖలోనే ఉండిపోయారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు వెళ్లకుండా ఉన్నత స్థాయిలో పైరవీ చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. నగరంలో కీలక పోస్టుల్లో పనిచేసి రెండేళ్ల క్రితం అనకాపల్లి జిల్లాకు వెళ్లి భారీగా అక్రమాలకు పాల్పడిన సీఐను ఇటీవల రేంజ్‌కు సరండర్ చేశారు. ప్రస్తుతం ఆయన సిటీలో పోస్టింగ్ కావాలంటూ అధికార పార్టీ కీలక నేత ద్వారా ఒత్తిడి తీసుకువస్తున్నారు.

ఫార్మాలో ప్రమాదాల పరంపర

(5వ పేజీ తరువాయి)

వెళుతున్నప్పుడు అక్కడ ఏ ప్రక్రియ జరుగుతున్నదో తెలుసు కాబట్టి దానికి తగిన రక్షణ పరికరాలు ధరించి వెళ్లాలి. అంటే మంచి మాస్క్ కచ్చితంగా ధరించాలి. అది విష వాయువుల నుంచి రక్షణ కల్పించేదై ఉండాలి.

- హెచ్2ఎస్‌ను వాసనను బట్టి గుర్తుపట్టవచ్చు. మ్యాన్‌హోల్ తెరిచి ఉంది కాబట్టి ఈటీపీ పైకి వెళుతున్నప్పుడే ఆ వాసన వస్తుంది. అంటే దానిని గుర్తు పట్టే స్థితితో సేఫ్టీ అధికారులు ఉండాలి. వారు ఆ వాసన గుర్తు పట్టి కిందికి దిగిపోవాలి. కానీ అలా చేసినట్టు లేదు.
- ప్రతి సంస్థ తయారుచేసే మందులను బట్టి 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)' పాటించాలి. మందుల తయారీ ప్రాంతంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సిబ్బందికి అవగాహన కల్పించి, తగిన భద్రతా పరికరాలు అందించాలి. అంటే మాస్క్‌లు, గ్లౌజులు, బూట్లు వంటివి అందులో భాగంగా ఉంటాయి.

ఏదో జరిగింది చెప్పడం లేదు

కంపెనీ యాజమాన్యం, పోలీసులు విషవాయువు లీకై దానిని పీల్చి చనిపోయారని చెబుతున్నారు. ఇంకే విషయాలు వెల్లడించ లేదు.

నిర్లక్ష్యం ఉందని అర్థమవుతోంది

ఈటీపీలోనే వ్యర్థాలను శుద్ధి చేయకూడదు. వేరే ట్యాంకులోకి తీసుకొని చేయాలి. కానీ వారు అలా చేయలేదు. పైగా మ్యాన్‌హోల్ తెరిచి ఉంచారు. అది మూసి ఉంటేనే ప్రక్రియ సజావుగా జరుగుతుంది. అక్కడ నిబంధనల ప్రకారం వ్యవహరించలేదు. నిర్లక్ష్యం ఉందని అర్థమవుతోంది. పైగా చనిపోయిన వారిలో ఒకరికి సేఫ్టీ విభాగంలో పదేళ్ల అనుభవం ఉంది.

-ముకుందరావు, ఈఈ
కాలుష్య నియంత్రణ మండలి

స్పందించని ఫ్యాక్టరీస్ విభాగం

ఈ ప్రమాదంపై వివరాలు తెలుసుకోవడానికి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి పరమేశ్వరరావుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత వారిదే. ఈ విభాగం పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. భద్రతా విభాగంలో పనిచేసే వారికి మళ్లీ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని అర్థమవుతోంది.





ఏడాదిలో రూ.229 కోట్లతో అభివృద్ధి

» పెందుర్తి ఎమ్మెల్యే రమేశ్ బాబు



పెందుర్తి, జూన్ 12:(ఆంధ్రజ్యోతి): పెందుర్తి నియోజకవర్గంలో ఏడాదిలో రూ.229 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విలేకర్లతో మాట్లాడారు. పెందుర్తి పరిధి జీవీఎంసీలో పది వార్డుల్లో రూ.117.80 కోట్లతో రోడ్లు, డ్రైన్లు, చెరువుల అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. పెందుర్తి, సబ్బవరం, పరవాడ గ్రామీణ ప్రాంతాల్లో రూ.50 కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టామని, ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు రూ.12 కోట్లతో తాగునీటి అభివృద్ధి చర్యలు చేపట్టామని ఆయన అన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ నిధులు ద్వార రూ.10 కోట్లతో రహదారులు నిర్మాణం పనులు ప్రారంభ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ద్వారా రూ.8 కోట్లతో, రూ.1కోటితో ఇరిగేషన్ పనులు, సీఎస్ఆర్ గ్రాంటు 2కోట్లు, మినీ గోకులం పథకం రూ.1కోటితో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన వంద రోజుల్లో ప్రారంభోత్సవాలు చేశామని వివరించారు.

మాస్టర్ ప్లాన్‌లో ఏడు రోడ్లు నిర్మాణానికి ప్రతిపాదన

నియోజకవర్గంలో ఏడు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదన జరిగిందని ఇందులో భాగంగా వేపగుంట నుంచి జుత్తాడ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులో 80 అడుగుల రోడ్డు, నాయుడుతోట నుంచి పోర్లుపాలెం 100 అడుగుల రోడ్డు నిర్మాణంలో ఉన్నాయని, త్వరలోనే వేపగుంట పినగాడి రోడ్డు విస్తరణ జరుగుతుందని రమేశ్ బాబు స్పష్టం చేశారు. హౌసింగ్‌కు రూ. 2.73 కోట్లు, వ్యవసాయ శాఖతో రైతులకు రూ.55 లక్షలు విత్తన మెకనైజేషన్ సబ్సిడీలు ఇచ్చామని చెప్పారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 28 మందికి రూ.72.78 లక్షలు చెక్కులు అందించామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 44 కంపెనీలతో చేపట్టిన మేగా జాబ్‌మేళాలో 826 మందికి ఉపాధి కల్పించామని, కొత్తగా 369 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశామని ఆయన తెలిపారు.

పంచగ్రామాల భూసమస్యకు మార్గం

సింహాచలం దేవస్థానం పరిధిలో పంచగ్రామాల భూసమస్య పరిష్కారినికి మార్గం సుగమం చేస్తున్నామని అన్నారు. దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూములు కేటాయించినందుకు 12 వేలు నిర్మాణాలు క్రమబద్ధీకరణ చేపట్టామన్నారు. పరవాడలోని ఫార్మా కాలుష్యం గ్రామం తాడితరలింపుకు మూడు స్థలాలు ఎంపిక చేశామన్నారు. పెందుర్తిలో అగ్నిమాపక కేంద్రం రూ 2.25 కోట్లతో నిర్మాణం చేస్తామని చెప్పారు.

విమాన ప్రమాదం దురదుష్టకరం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరగడం బాధాకరమని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.




















ఎమ్మెల్యే పంచకర్ల జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు

పెందుర్తి, జూన్ 12:(ఆంధ్రజ్యోతి): పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జన్మదిన వేడుకలు శుక్రవారం జరగనున్నాయి. ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గంలో కూటమి కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేయనున్నారు. ఈ సందర్భంగా సుజాతనగర్ జనసేన కార్యాలయంలో కార్యకర్తలతో భారీ కేకు కటింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేడుకల్లో భాగంగా వృద్ధులకు అన్నదానం, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్నామని కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమాని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అమరావతిలో జరగనున్న 175 నియోజకవర్గ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమావేశానికి పంచకర్ల హాజరవుతారని, జన్మదిన వేడుకలకు హాజరుకారని క్యాంపు కార్యాలయం తెలిపింది.


















ఉక్కు ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపర్చాలి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపర్చాలని ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరుతున్నారు. ఆస్పత్రిలో ఇటీవల చాలా మంది ఉద్యోగులు వీఆర్‌ఎస్, పదవీ విరమణ చేయడంతో చాలా వరకు వైద్య సేవలు తగ్గిపోయాయని కార్మిక నాయకులు పేర్కొన్నారు. అలాగే పెదగంట్యాడ ఆస్పత్రిని గతంలో మాదిరిగా నడపాలని కోరుతున్నారు.









ఆరిలోవ తోటగరువు జడ్పీ పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



ఉచితంగా అందుకున్న కొత్త పుస్తకాలను చూపుతున్న విద్యార్థిని

బడుల్లో 'కొత్త' కళ

వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఉత్సాహంగా బడిలో అడుగుపెట్టిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అంతా కొత్త వాతావరణం స్వాగతం పలికింది. బదిలీల అనంతరం కొత్త ఉపాధ్యాయులు వచ్చారు. వీరికి పాఠశాల వాతావరణం, కొత్త ముఖాలతో విద్యార్థులు కనిపించారు. అలాగే విద్యారులు రాగానే వారి చేతికి కొత్త పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు తదితర ప్రభుత్వం సరఫరా చేసిన సామగ్రి అందజేసిన ఉపాధ్యాయులు ఆప్యాయంగా పలకరించారు. పాఠశాలల్లో అందరికీ కొత్త వాతావరణం స్వాగతం పలికింది. సగటున 50 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు.

-ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం



దండుబజారులో ప్రభుత్వం సరఫరా చేసిన బ్యాగులను అందజేస్తున్న ప్రిన్సిపాల్



కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక కూలిపోయిన దృశ్యం

కుప్పకూలిన ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక

కూర్మన్నపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం జంక్షన్లో 1,582 రోజులుగా రిలే నిరాహార దీక్షల పోరాటాలకు సాక్ష్యంగా నిలిచిన పోరాట వేదిక సభా ప్రాంగణం గురువారం కురిసిన భారీ వర్షానికి కుప్పకూలి పోయింది. ఈ వేదిక నుంచే పోరాటాలను నాలుగేళ్లుగా నిర్వహిస్తున్నారు. తెల్లవారు జామున కూలటంతో పెద్ద ప్రమాదం తప్పింది. పగటి పూట అయితే ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు అందులో కూర్చునేవారు. ఆ సమయంలో ఈ వేదిక కూలినట్లయితే ప్రాణనష్టం జరిగేది. ఎవరూ లేని సమయంలో కూలటంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

యువకులను అటకాయించిన రౌడీషీటర్‌కు రిమాండ్

కంచరపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యువకులను అటకాయించి దోపిడీకి పాల్పడిన రౌడీషీటర్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్టు ఎయిర్‌పోర్టు జోన్ ఎస్ఐ సుదర్శనరావు తెలిపారు. ఈ నెల 10న రాత్రి సుమారు 10 గంటల సమయంలో 104 ఏరియా బాపూజీనగర్ ప్రాంతానికి చెందిన ఎం.చిట్టిబాబు (28), అతని స్నేహితుడు రాయిన అనీల్ కుమార్ (24) సమీపంలో ఉన్న వాలీబాల్ గ్రౌండ్ వద్ద కూర్చొని మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన సంపత్‌రావు సురేష్ (25), గుమ్మడి కార్తీక్ (30) వారిని బెదిరించి, దాడికి పాల్పడి వారి వద్ద ఉన్న ఐదున్నర తులాల వెండి బ్రాస్లెట్‌ను బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి ఉడాయించారు. ఈ విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు క్రైం ఎస్ఐ సుదర్శనరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి నిందితులను గుర్తించారు. నిందితుల్లో ఒకడైన సంపత్‌రావు సురేష్‌పై గతంలో హత్య, కొట్లాట కేసులు ఉన్నాయి. ఎయిర్‌పోర్టు స్టేషన్ పరిధిలో రౌడీషీట్ కూడా ఉందని సుదర్శనరావు తెలిపారు. మరో నిందితుడు గుమ్మడి కార్తీక్‌పై కూడా పెందుర్తి, ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతదేహం



యువకుడి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ నుంచి గోపాలపట్నం (కొత్తపాలెం) రైల్వే క్యాబిన్‌ల మధ్య రైల్వే ట్రాక్‌పై గురువారం గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు గుర్తించారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపాలెం క్యాబిన్-దువ్వాడ స్టేషన్‌కు మధ్యలో గురువారం ఉదయం గుర్తు తెలియని యువకుని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారం అందచేశారు. విశాఖపట్నం జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 5.4 అడుగుల ఎత్తు కలిగి సుమారు 35 ఏళ్ల వయస్సు కలిగిన యువకుడు తలకు తీవ్రగాయం కావడంతో పాటు కుడి కాలు విరిగి మృతి చెంది ఉన్నట్టు గుర్తించారు. రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తపరిచారు. మృతుడు సిమెంట్ కలర్ నెక్ టీ షర్ట్, నేవీ బ్లూ కలర్ ఫుల్ ట్రాక్ ధరించి ఉన్నాడు. మృతుడి గురించి తెలిసిన వారు ఫోన్ : 73820 58996కు సమాచారం అందజేయాలని ఎస్ఐ లక్ష్మి తెలిపారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర కారాగారంలో 35 మందికి స్థానచలనం

ఆరిలోవ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారంలో విధులు నిర్వహిస్తున్న 35 మంది ఉద్యోగులకు బదిలీలు జరిగినట్లు సూపరింటెండెంట్ ఎం.మహేష్ తెలిపారు. 33 మంది వచ్చి తమ విధులలో చేరారని తెలిపారు. వీరిలో ముగ్గురు జైలర్లు, హెడ్ వార్డర్లు, సీనియర్ వార్డర్లు, వార్డర్లకు బదిలీలు జరిగినట్లు ఆయన తెలిపారు. మిగిలినవారు కూడా సోమవారం నాటికి విధుల్లో చేరతారని పేర్కొన్నారు.

సీఎం పాలన స్ఫూర్తితో నగరాభివృద్ధికి చర్యలు

మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సుపరిపాలనను స్ఫూర్తిగా తీసుకుని విశాఖ నగరాభివృద్ధికి కృషిచేస్తామని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. నిత్యం వార్డులలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నానని, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్ల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మేయర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో బీజేపీ, జనసేన పార్టీల ఫ్లోర్ లీడర్లు, పలువురు కార్పొరేటర్లతో కలిసి మేయర్ శ్రీనివాసరావు కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. మొదటి ఏడాది అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కొల్లగొట్టినప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటి నెరవేరుస్తుందని చెప్పారు. గురువారం తల్లికి వందనం ప్రారంభించారని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతుందన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ రెడ్ బుక్ అంటూ దుష్ప్రచారం చేస్తోందని, అది ప్రజా పాలన బుక్ అని తెలుసుకోవాలన్నారు. ఈ నెల 21న ప్రధాని సమక్షంలో నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన ఫ్లోర్ లీడర్ బీశెట్టి వసంతలక్ష్మి, బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత, కూటమి కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



కేకు కోస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు

ఘనంగా కూటమి పాలన విజయోత్సవం

అక్కయ్యపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకున్న నేపథ్యంలో టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఎనభై అడుగుల రోడ్డులోని మహారాణి పార్లర్ జంక్షన్‌లో విజయోత్సవం, ర్యాలీ ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ హాజరై టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కోసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కొన్ని నెరవేర్చిందని, మరికొన్ని రానున్న రోజుల్లో నెరవేర్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, నాయకులు ఈతలపాక సుజాత, బొడ్డేటి మోహన్, కొయిలాడ వెంకటేశ్, తమ్మినేని మోహన్, ముత్యాల నాయుడు, అకిరెడ్డి జగదీష్, కన్నం వెంకట రమణారావు, యాగాటి ఆదిలక్ష్మి, ఆవాల నారాయణ స్వామి, దయాల ఈశ్వరరావు, వాసుపల్లి రాజు, భరణికాన రాజు పాల్గొన్నారు.

ఇక్కడ జాగా లేదు!

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వాహనాల పార్కింగ్‌కు అవస్థలు

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సులో వాహనాలకు పార్కింగ్ స్థలం లేక పలు అవసరాల కోసం బైక్‌లు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాల మీద వచ్చే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కాంప్లెక్సుకు దూరంగా రోడ్డు పక్కన తమ వాహనాలు పార్కింగ్ చేసి కాంప్లెక్సుకు వచ్చి తమ పనులు ముగించుకొని తిరిగి అక్కడకు చేరి వాహనాలతో వెళ్తున్నారు. ఇలా రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల దృష్టి పడక పోతే ఇదంతా సజావుగా జరిగిపోతుంది. ట్రాఫిక్ పోలీసుల దృష్టి పడితే చలానాలు పడిపోతాయి. ఆర్టీసీ ద్వారకా కాంప్లెక్సులో రీజనల్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్, పర్సనల్ ఆఫీసర్, ఇతర అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలోని 7 డిపోల్లో 814 బస్సుల నిర్వహణ, ఐదువేల మంది కార్మికుల బాగోగులు చూసేందుకు సంబంధించిన కార్యాలయాలన్నీ ఇక్కడే ఉన్నాయి. విద్యార్థి బస్‌పాస్ కౌంటర్లు, రిజర్వేషన్ కౌంటర్లు ఇందులోనే ఉన్నాయి. కాంప్లెక్సులో 30 వరకు స్టాల్స్, రెండు హోటళ్లు ఉన్నాయి. ఇవి కాకుండా సెంట్రల్ లాజిస్టిక్స్ కార్యాలయం, గోడౌన్, పార్సిల్ బుకింగ్, డెలివరీ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. వీటి అవసరాల మీద రోజూ వందలాదిమంది వస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది ద్విచక్ర వాహనాలు, కార్లు తీసుకొస్తుంటారు. ద్వారకా కాంప్లెక్సు ఇన్‌గేటు దగ్గర ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేసేందుకు వీలులేదు. జిల్లా, రాష్ట్ర, అంతరాష్ట్ర బస్సులు గొలుసుకట్టుగా వస్తుంటాయి. అవుట్ గేటు దగ్గర కూడా ఇదే పరిస్థితి. రీజనల్ మేనేజర్ కార్యాలయం ఎదురుగా కొద్దిపాటి స్థలం ఉంటే, దాన్ని ఆర్టీసీ ఆర్ఎం, డీఎం, ఇతర ఉన్నతాధికారులకు కేటాయించారు. ద్వారకాబస్ కాంప్లెక్సుకు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌కు మధ్య ఉన్న ఖాళీ స్థలాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ వారికి కేటాయించారు. వారు ఆ ప్రాంతానికి కంచె వేసుకుని గేటు పెట్టుకున్నారు. బస్సుల కారిడార్‌లో ప్రైవేటు వాహనాలు ప్రవేశించేందుకు వీలులేదు. ఇంత ప్రాధాన్యత కలిగిన కాంప్లెక్సుకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల వివిధ అవసరాలపై సొంత వాహనాలతో కాంప్లెక్సుకు వచ్చేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. ఏడు డిపోల నుంచి వివిధ పనులపై ఆర్ఎం కార్యాలయానికి వస్తుంటారు. అద్దెబస్సుల యజమానులు, స్టాల్స్ యజమానులు, హోటళ్లకు వచ్చే వారు తమ వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియని పరిస్థితి. స్టాల్స్ నిర్వాహకులకు కూడా వాహనాల పార్కింగ్ స్థలం లేదు. కాంప్లెక్సులో ఆర్టీసీ జోనల్ స్థాయి సమావేశాలు జరిగినప్పుడు వచ్చే అధికారుల వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలంలేక వేరే ప్రాంతాల్లో పబ్లిక్ ప్లేస్ పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటి కైనా ఆర్టీసీ అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు. లేకుంటే కాంప్లెక్సు ప్రాధాన్యత మసకబారే ప్రమాదముందని అభిప్రాయపడుతున్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నోపార్కింగ్ బోర్డు వద్ద నిలిపిన వాహనాలు



పార్కింగ్ స్టాండ్ వద్ద నిలిపిన ప్రైవేటు వ్యక్తుల వాహనాలు

కంటైనర్ ఢీకొని యువతి మృతి

- సోదరుడికి తీవ్ర గాయాలు
- తుంగ్లాం రైల్వే గేటు సమీపం వై జంక్షన్ వద్ద ఘటన
- పోలీసుల అదుపులో కంటైనర్ డ్రైవర్



కుమార్తె మరణ వార్త విని రోదిస్తున్న తల్లి సూర్యమణి



మృతురాలు గొంప గీత (23) (ఫైల్ ఫోటో)

ఆటోనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) :తుంగ్లాం రైల్వే గేటుకు సమీపంలో ఉన్న వై జంక్షన్ వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందగా, యువకుడికి తీవ్ర గాయాలు పాలయ్యాడు. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 88 వార్డు యాదవ జగ్గరాజుపేటలో గొంప శ్రీను, సూర్యమణి దంపతులకు వర ప్రసాద్ (సంతోష్-25), గీత (23)లతో నివసిస్తున్నారు. ఆ నలుగురు బతుకు తెరువు కోసం ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. గురువారం ఉదయం శ్రీను కంపెనీకి విధులకు బయలుదేరాడు. స్థానికంగా ఉన్న బట్టలు కంపెనీలో పని చేస్తున్న సూర్యమణి తనకు డ్యూటీకి టైమ్ అవుతోందని చెప్పడంతో తల్లి సూర్యమణిని సంతోష్ ఫ్యాక్టరీ దగ్గర స్కూటర్‌పై దించాడు. చెల్లెలు గీత కూడా టైమ్ అయిపోతోందనీ, డ్రాప్ చేయమని కోరగా.. సంతోష్ ఆమెను స్కూటీపై ఎక్కించుకొని యాదవ జగ్గరాజుపేట నుంచి ఆటోనగర్ వైపు బయలుదేరాడు. రైల్వే గేటు దరి వై జంక్షన్ వద్దకు వచ్చేసరికి వీరి వాహనానికి శ్రీసాయి మెక్సా షిప్పింగ్ కంపెనీకి చెందిన కంటైనర్ లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో గీత లారీ వెనుక చక్రాలు కింద పడి ఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఆమె శరీరం నుజ్జయింది. సంతోష్‌కు కాలు, చేతులు విరిగిపోయి తీవ్ర గాయాలు పాలయ్యాడు. అన్నాచెల్లెలు ఇద్దరూ ఆటోనగర్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో విధులకు స్కూటీపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కూతురు మృతి చెందడం, కొడుకు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలవడంతో ప్రసాద్, సూర్యమణి దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకొన్న దువ్వాడ పోలీసులు గీత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సంతోష్‌ను ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్‌ను దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసును సీఐ మల్లేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

14, 15 తేదీల్లో హైలైఫ్ వస్త్రాభరణాల ప్రదర్శన



ఆధునిక వస్త్రాలు చూస్తున్న మహిళలు (ఫైల్)

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14, 15 తేదీల్లో నగరంలోని నోవాటెల్ వరుణ్ బీచ్‌లో హైలైఫ్ బ్రైడ్స్ వస్త్రాభరణాల ప్రదర్శన జరగనుంది. హైలైఫ్ సంస్థ దీన్ని నిర్వహిస్తుంది. వివాహాల్లో పెళ్లి కూతురు అలంకరణకు సంబంధించిన వస్త్రాలు, ఆభరణాలతోపాటు వాటిని అలంకరించే విధానాలు ఇందులో ప్రదర్శించనున్నారు. భారతదేశంలోని టాప్ డిజైనర్స్ రూపొందించిన వాటిని ఇందులో ప్రదర్శిస్తారు. వెడ్డింగ్ ఫ్యాషన్ పేరిట ఈ ప్రదర్శన జరుగుతుంది.

పోలీసు కస్టడీలో రౌడీ షీటర్ విచారణ

ఆనందపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆనందపురంవాసి మీసాల అప్పలనాయుడును పోలీసు కస్టడీకి తీసుకుని న్యాయవాది సమక్షంలో ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో గురువారం విచారించారు. గత నెల 31న అట్రాసిటీ కేసులో అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. నగరంలోని రామాటాకీస్ ప్రాంతానికి చెందిన దళిత మహిళ కుంచంగి లక్ష్మికి భూమి విక్రయిస్తానని చెప్పి రూ.97 లక్షలు తీసుకుని మోసం చేయడంతో ఆయన్ను అరెస్టు చేశారు. విచారణలో డబ్బు తీసుకున్నట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. మరికొన్ని లావాదేవీలకు సంబంధించిన వివరాలు కూడా దర్యాప్తులో బయటపడ్డాయని పేర్కొన్నారు. కోర్టుకు తరలించి మరోసారి పోలీసు కస్టడీ కోరనున్నట్లు తెలిపారు.